

విద్యుత్ బకాయిలు.. రూ. 203 కోట్లు

- ప్రభుత్వానివి రూ. 51 కోట్లు, ప్రైవేటువి రూ. 152 కోట్లు
- వసూళ్ళపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి

అద్దంకి,సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖకు బకాయిలు గుదిబండ లా మారాయి. బాపట్ల జిల్లాలో మొత్తం 203 కోట్ల రూపాయల వరకు బకాయిలు ఉన్నాయి. అందులో ప్రభుత్వ బకాయిలు 51 కోట్ల రూపాయలు కాగా, ప్రభుత్వేతర బకాయిలు 152 కోట్ల రూపాయలుగా ఉన్నాయి. ఆగస్టు నెల చివర వరకు బకాయిలు డివిజన్ల వారీగా పరిశీలిస్తే అద్దంకి డివిజన్‌లో ఎల్టీ కేట గిరిలో మొత్తం బకాయి 32.89 కోట్ల రూపాయలు కాగా, అందులో ప్రభుత్వ బకాయిలు 5.48 కోట్లరూపాయలు, ప్రభుత్వేతర బకాయిలు 27.41 కోట్ల రూపాయలు గా ఉన్నాయి. బాపట్ల డివిజన్‌లో ఎల్టీ కేటగిరిలో మొత్తం బకాయి రూ.37.89 కోట్లు కాగా ప్రభుత్వ బకాయి రూ.23.05 కోట్లు, ప్రభుత్వేతర బకా యి14.83 కోట్ల రూపాయలుగా ఉన్నాయి. చీరాల డివిజన్‌లో ఎల్‌టీ కేటగిరిలో మొత్తం బకాయి 23.42 కోట్ల రూపాయలు కాగా ప్రభుత్వ బకాయి రూ. 8.63 కోట్లు, ప్రభుత్వేతర బకాయి 14.79 కోట్ల రూపాయలు గా ఉంది. హెచ్‌టీ కేటగిరి లో అద్దంకి డివిజన్‌లో మొత్తం బకాయి.. ప్రభుత్వేతర బకాయే 63.58 కోట్ల రూపాయలుగా ఉం ది. బాపట్ల డివిజన్‌లో 29.63 కోట్ల రూపాయలు కాగా ప్రభుత్వ బకాయి13.15 కోట్ల రూపాయలు, ప్రభుత్వేతర బకాయి 16.48 కోట్లరూపాయలుగా ఉంది. చీరాల డివిజన్‌లో మొత్తం బకాయి 15.91 కోట్ల రూపాయలు కాగా ప్రభుత్వ బ కాయి 0.81 కోట్ల రూపాయలు, ప్రభుత్వేతర బకాయి 15.10 కోట్ల రూపాయలు గా ఉంది. బకాయిలు పెద్దమొత్తంలో పేరుకు పోవటంతో విద్యుత్‌శాఖ ఉన్నతా ధికారులు ఇటీవల నిర్వహించిన సమీక్ష లో వసూలు పై ప్రత్యేక దృష్టి పెట్టారు.



అద్దంకిలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం



ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

- 2024-25 పనితీరులో ఏపీ ఎంపీల్లో లావుకు అగ్రస్థానం
- పార్లమెంట్ నివేదికలో వెల్లడి

ప్రశ్నించావు.. ప్రథమంగా నిల్చావు!

నరసరావుపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి నరసరావుపేట ఎంపీ నంబరు వన్ పార్లమెంటేరియన్‌గా నిలిచారు. ఈ మేరకు పార్ల మెంట్ ప్రతినిధులు ఆదివారం నివేదికను విడుదల చేశారు. పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ ఎంపీల పనితీరుపై సదరు బృందం నివేదికను రూపొందించింది. పార్లమెంట్ సమావేశాలకు హాజరు, ప్రజా సమస్యలపై అడిగిన ప్రశ్నలు, వివిధ అంశాల్లో జరిగిన చర్చల్లో పాల్గొన్న లావు ఏపీకి చెందిన పార్లమెంట్ సభ్యుల్లో ప్రథమ స్థానం పొందారు. 2024-25లో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో శ్రీకృష్ణదేవరాయలు 67 పశ్నలు అడిగారు. లోక్‌సభలో వివిధ అంశాలపై 22 చర్చల్లో ఆ యన పాల్గొన్నారు. పార్లమెంట్‌కు ఆయన హాజరు 83.82 శాతంగా నమోదైంది. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా లోక్‌సభలో ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

పల్నాడు అభివృద్ధికి నిరంతర కృషి

రాష్ట్రానికి రావాల్సిన వివిధ ప్రాజెక్టులపై పార్లమెంట్ సమావేశాల్లో ప్రశ్నించడంతో పాటు వాటిపై కీలకంగా లావు చర్చించారు. అమరావతి రాజధానికి ప్రభుత్వం తరపున నిధుల కోసం లావు కృషి చేస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వారధిగా నిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సూచించిన విధంగా పార్లమెం ట్‌లో వాటి సాధనకు తన వంతు కృషి చేస్తున్నారు. జిల్లాలో జాతీయ రహదారుల నిధుల విడుదలకు కృషి చేశారు. వరికపూడిసెల ప్రాజెక్టుకు పర్యావరణ, అటవీ శాఖల అనుమతులు సాధించడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. పేరేచర్ల - కొండమోడు జాతీయ రహదారి విస్తరణకు నిధుల విడుదల, జిల్లాలో పలు చోట్ల రైల్వే ఆర్‌యూబీల మంజూరు, నాగార్జున సాగర్ పర్యాటక అభివృద్ధికి కేంద్రం నుంచి నిధుల మంజూరు చేయించడంలో లావు విజయ వంతమయ్యారు. జిల్లా ప్రగతి కోసం కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో ఎ ప్పటికప్పుడు కేంద్ర మంత్రులతో చర్చల ద్వారా సా నుకూలత సాధిస్తున్నారు. జిల్లాకు కేంద్ర విద్యాల యాల మంజూరులో ఆయన పాత్ర ఉంది. పార్లమెం ట్‌లో నంబర్‌వన్‌గా నిలిచిన లావు శ్రీ కృష్ణదేవరా యలను పలువురు పార్టీ నేతలు అభినందించారు.

15.50 శాతం వృద్ధి లక్ష్యం కావాలి

- విభాగాల వారీగా పనితీరు మెరుగుపడాలి
- ఫిషరీస్ విభాగం జీవీఏలో టాప్5లో బాపట్ల జిల్లా
- కలెక్టర్ల సదస్సులో సీఎం దిశానిర్దేశనం



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా అధికారులు పనిచే యడంతో పాటు ఈ ఆర్థిక సంవత్సరం జీఎస్‌డీపీలో వృద్ధిరేటు నమోదు కావాలని సచివాలయం వేదికగా సోమవారం జరి గిన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు మార్గ నిర్దేశనం చేశారు. తాజా బదిలీల్లో భాగంగా జిల్లా కు నూతన కలెక్టర్, ఎస్పీ నియామకం అయిన సంగతి తెలిసిందే. జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ వీ వినోద్‌కుమార్ శనివారం బాధ్యతలు తీసుకోగా, సచివాలయం వేదికగా సోమవారం జరిగిన కలెక్టర్ల సదస్సుకు జిల్లా సమాచారంతో ఆయన హాజరయ్యారు. ఇందులో భాగంగా సదస్సు ఎజెం డాలో పొందు పర చిన అంశాలతో పాటు, త్వరలో జరగబోయే బీచ్ ఫెస్టివల్, యూరియా అంశాలపై సమగ్ర సమాచారం వంటి అంశాలతో కలెక్టర్ సదస్సు బాట పట్టారు. ప్రభుత్వం వద్ద స్వర్ణాంధ్ర మొదలుకుని వ్యవసాయ సంబంధిత రంగాలలో జీవీఏ(స్థూల విలువ జోడింపు) పరంగా జిల్లా ఏస్థానంలో ఉందనే వాటిపై సవివర నివేదికలు సిద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా జిల్లాకు సంబం ధించి జీఎస్‌డీపీ వృద్ధిరేటు 15.50 శాతం చేరేలా పనిచేయాలని సీఎం సూచించినట్లు సమాచారం. కేపీఐ(కీ ఫెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్)ర్యాంకులో భాగంగా స్వర్ణాంధ్రకు జిల్లా 61 పాయింట్లతో 19 వ స్థానంలో నిలిచినట్లు సదస్సులో నిలిచింది. అగ్రికల్చర్ విభాగంలో 32 పాయింట్లతో 5 వస్థానంలో నిలవడం గమనార్హం. వ్యవసాయ సంబంధిత రంగాల జీవీఏలో మాత్రం 13 శాతంతో 12 వస్థానంలో నిలిచినట్లు సదస్సులో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన నివేదికలో పొందుపరిచారు. ఫిషరీస్ విభాగంలో జీవీఏలో జిల్లా 4 వస్థానంలో నిలికి టాప్ 5లో చోటు దక్కించుకుంది.

నేడు ఎస్పీ హాజరు..

రెండు రోజుల పాటు జరిగే సదస్సులో భాగంగా జిల్లా ఎస్పీ బీ ఉమామహేశ్వర్ మంగళవారం హాజరుకానున్నారు. గతేడాది కాలంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న నేరగణాంకాలు, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై నివేదికలతో ఎస్పీ సదస్సుకు హాజరు కానున్నారు.

అత్యంత కీలక అంశాలపై...

బాధ్యతలు స్వీకరించిన ఒక్క రోజు వ్యవధిలోనే కలెక్టర్ వినోద్‌కుమార్ సచివాలయంలో రెండు రోజుల పాటు జరిగే కలెక్టర్ల సదస్సుకు హాజరయ్యారు. జీఎస్‌డీపీ గణాంకాలతో పాటు ఆయా విభాగాలలో జిల్లాకు సంబంధించి జీవీఏ ర్యాంకులు ప్రభుత్వం వద్ద ఉండడంతో వాటి ఆధారంగా సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. వాటితో పాటు జిల్లాలో ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశాలపై సవివర నివేదికలతో కలెక్టర్ సదస్సుకు హాజరైనట్లు తెలుస్తోంది. వాటిలో ముఖ్యంగా ఈ నెల 26,27,28 తేదీలలో సూర్యలంక వేదికగా జరిగే బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లతో పాటు యూరియా ఇబ్బందులు అధికంగా ఎదుర్కొంటున్న మూడు జిల్లాల్లో బాపట్ల జిల్లా ఉండడంతో, ఇప్పటి వరకు జరిగిన పంపిణీ, ప్రస్తుతం ఉన్న నిల్వల వివరాలతో కలెక్టర్ సదస్సులో పాల్గొన్నారు. ఇవే కాకుండా మార్క్‌ఫెడ్ ద్వారా ఇప్పటి వరకు కొనుగోలు చేసిన బర్లీ పొగాకు పరిమాణం ఎంత, అన్నదాతల ఖాతాల్లో జమ అయిన నిధుల వివరాల వంటి లెక్కలు కూడా సదస్సులో చర్చకు రావచ్చనే అంచనాలు ఉన్నాయి. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీ4 వంటి పథకంతో పాటు విభాగాల వారీగా ప్రస్తుత పనితీరు వంటివన్నీ కూడా సదస్సులో భాగం కానున్నాయి.

వృద్ధ దంపతుల ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ భర్త మృతి

అద్దంకి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలతో పాటు జీవనం భారంగా మారడంతో జీవితంపై విరక్తి చెందిన వృద్ధ దంపతులు పిడూరి సత్యనారాయణ, జయలక్ష్మి దంపతులు ఆత్మహత్యకు యత్నించారు. కాగా చికిత్స పొందుతూ భర్త పిడూరి సత్యనారాయణ(70) సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. భార్య ఒంగోలు రిమ్స్ లో చికిత్స పొందుతోంది. పోలీసుల కథనం మేరకు..., అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్‌లో నివాసం ఉండే సత్యనారాయణ, జయలక్ష్మి దంపతులకు ఒక కుమారుడు ఉన్నారు. ఆయన గుంటూరులోని ఓ ప్రయివేటు కంపెనీలో చిరుఉద్యోగిగా పనిచేస్తున్నారు. వృద్ధ దంపతులు అద్దంకిలోని రామ్‌నగర్ లో సొంత ఇంటిలో ఉంటున్నారు. భార్యకు పక్షవాతం రావడం, భర్తకు అనారోగ్య సమస్యలు ఉండడంతో కుమారుడు పలుమార్లు కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం చేయించి చికిత్సలు చేయించారు. అయితే ఆరోగ్య సమస్యలు వెంటాడుతునే ఉండడంతో జీవితంపై విసుగు చెందిన వృద్ధ దంపతులు శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో వైద్యం అందించే కాంపౌండర్ ఇంటికి రాగా దంపతులు పురుగు మందు తాగిన విషయాన్ని చెప్పారు. దీంతో విషయాన్ని కాంపౌండర్ వెంటనే కుమారుడు కృష్ణకుమార్‌కు ఫోన్ చేసి తెలిపాడు. స్థానికుల సాయంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ నుంచి ఒంగోలు రిమ్స్ కు తరలించారు. చికిత్స పొందుతూ సత్యనారాయణ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఒంగోలు రిమ్స్ నుండి వచ్చిన సమచారం మేరకు, కుమారుడు కృష్ణకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

ఆరోగ్యం..మన చేతుల్లోనే..!
- వీధుల్లో చిరుతిండ్లతో అనారోగ్యం
- విజృంభిస్తున్న వైరల్ ఫీవర్లు

గుంటూరులో జాతీయ మీడియా ప్రతినిధులు
- రాష్ట్రంలో మూడు రోజుల పర్యటన ప్రారంభం
- వెంగళాయపాలెం, మిర్చి యార్డుల సందర్శన

డీఎస్సీలో షేక్ మీర్జాకు రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంక్ 8

మూడు ఉద్యోగాలకు ఎంపికైన శ్యామల

చట్టపరిధిలో అర్జీలు పరిష్కరిస్తాం : ఎస్పీ



అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి) : చట్టపరిధిలో విచారించి అర్జీలను పరిష్కరిస్తామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు జిల్లా నలుమూలల నుంచి 54మంది అర్జీల ద్వారా తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. అర్జీలు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్న ఎస్పీ వాటిని నిర్దిష్ట గడువులోగా చట్టపరంగా విచారించి పరిష్కారిస్తామని హామీనిచ్చారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని పోలీసు అధికారులను హెచ్చరించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యల పై నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డిఎస్పీ పి.జగదీష్‌నాయక్, పీజీఆర్‌ఎస్ సెల్ ఎస్సై ఎ.నాగేశ్వరరావు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ వర్గాల్లో.. కలకలం

వైసీపీ హయాంలో పల్నాడులో బరితెగించిన పోలీసులు

- కారుతో ఢీ కొట్టి టీడీపీ నేత జల్లయ్య హత్య
- కేసు విచారణ తారుమారు చేసిన ఇద్దరు సీఐల సస్పెన్షన్
- నిందితులను తప్పించడమే కాదు... హతుని బంధువులే నిందితులుగా కేసు



8

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడులో కళంకిత సీఐల సస్పెన్షన్ వ్యవహారం పోలీసు వర్గాల్లో సంచలనం సృష్టించింది. గత వైసీపీ హయాంలో జరిగిన టీడీపీ నేతల హత్యల్లో అత్యధిక ఘటనల్లో ప్రత్యక్షంగానో లేదంటే పరోక్షంగానో పోలీసుల ప్రమేయం ఉందనేది బహిరంగ రహస్యమే. నాడు టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గూండాలు దారుణంగా మతమార్చిన కేసులో పోలీసులు వ్యవహరించిన తీరు పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఈ కేసు విచారణను తారుమారు చేసిన ఇరువురు సీఐలు షమీవుల్లా, జయకుమార్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే....

యూరియా కొరతలేదు : కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



బాపట్ల, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కొరతలేదు కాబట్టి రైతులు నిర్భయంగా వచ్చి యూరియా పొందవచ్చుఅని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌కేలు, పీఏసీఎస్ 35 కేంద్రాల ద్వారా 4983మంది రైతులకు 220 మెట్రిక్‌టన్నుల యూరియా పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఇంకా 220మెట్రిక్‌టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

స్మార్ట్ కార్డుల ద్వారానే బియ్యం పంపిణీ : ఇన్‌చార్జ్ జేసీ గంగాధర్‌గౌడ్

కొత్త స్మార్ట్ కార్డుల ద్వారానే బియ్యం పంపిణీ జరుగుతుందని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్ తెలిపారు. స్మార్ట్ కార్డుల పంపిణీని సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్డులను ప్రజల ఇంటి వద్దకే అందిస్తామని చెప్పారు. జిల్లాకు 4.71 లక్షల స్మార్ట్ న్యూ రైస్‌కార్డులు వచ్చాయన్నారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వచ్చి, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కార్డులు పంపిణీ చేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి అమీర్‌బాషా, డీఎల్‌డీవో విజయమ్మ, సచివాలయాల కోఆర్డినేటర్ యశ్వత్, ఉపకలెక్టర్ లవన్న, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ రఘునాధరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా పాల్గొన్నారు.

ఉత్తమ ఇంజనీర్లుగా ఎదగాలి: వీసీ గంగాధరరావు



సివిల్ ఇంజనీరింగ్ సంఘం లోగో ఆవిష్కరణలో వీసీ తదితరులు

ఏఎన్‌యూ, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని ఉత్తమ ఇంజనీర్లుగా ఎదగాలని ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల సివిల్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఇంజనీర్ల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య గంగాధరరావు విచ్చేసి, ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సివిల్ ఇంజనీరింగ్ సంఘం లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో నాణ్యతతో కూడిన ప్రాజెక్టులు, ఆనకట్టలు నిర్మించారన్నారు. విశిష్ట అతిథి గుంటూరు డివిజన్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పూర్వ చీఫ్ ఇంజనీర్ జి.బ్రహ్మయ్య మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగు విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర విభాగాలతో పాటు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపల్ డాక్టర్.డి.చంద్రమౌళి, అసిస్టెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ గోపికృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వరరావు ఇంజనీరు విశ్వేశ్వరయ్యసేవలను కొనియాడారు.

ఐసెట్ ప్రవేశాల గడువు పొడిగించాలి

ఏపీ ఐసెట్-2025 ప్రవేశాల గడువును పొడిగించాలంటూ ఏఎన్‌యూ ఏఐఎస్ఎఫ్ శాఖ డిమాండ్ చేసింది. ఐసెట్ ప్రవేశాలకు తక్కువ సమయం ఇవ్వడంపై సోమవారం వర్సిటీలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, ఏఎన్‌యూ అధ్యక్షుడు నాసరయ్య మాట్లాడుతూ కన్వీనర్ సెలవు దినాలను పట్టించుకోకుండా ప్రవేశాలు కేటాయించి విద్యార్థులను అయోమయానికి గురి చేశారన్నారు. విద్యార్థులకు ఒకరోజు సమయం ఇవ్వడం అన్యాయమన్నారు. సెలవుల్లో విద్యార్థులు కళాశాలల నుంచి సర్టిఫికెట్లు తెచ్చుకోలేక సీట్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రవేశాల ప్రక్రియను కనీసం రెండు రోజులు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుతో రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ సౌకర్యం

● స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేసిన చీఫ్ విప్ జీవీ



మహిళకు స్మార్ట్‌కార్డు అందజేస్తున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పేదలందరికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 12వ వార్డు అంబేడ్కర్ కాలనీలో క్యూఆర్ కోడ్ ద్వారా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినుకొండ పట్టణం, మండలంలో 59 రేషన్ షాపులు ఉన్నాయని, 32,792 మందికి రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా స్మార్ట్ రేషన్ కార్డు ద్వారా బియ్యం పొందవచ్చని తెలిపారు. వైసీపీ పాలనలో రేషన్‌షాపుల ద్వారా ప్రజల సొమ్మును దోచుకున్నారని విమర్శించారు. అవినీతిని అరికట్టి పేదలకు బహుళ ప్రయోజనాలను కల్పించడమే లక్ష్యంగా కోటికిపైగా స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి.. హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువ నాయకుడు లోకేశ్ ముందుకు సాగుతున్నారన్నారు. స్మార్ట్ కార్డు ద్వారా ప్రభుత్వ పథకాలను పొందేందుకు సులభతరంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, మెప్మా పీడీ లింగమూర్తి, ఏపీఐడీసీ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు, బీజేపీ నాయకుడు మేడం రమేష్, జనసేన నాయకుడు కొంజేటి నాగశ్రీను, జానీ, కౌన్సిలర్ షులి నాగరాజు, లింగా రామయ్య, నరసింహారావు, పత్తి పూర్ణ, టీడీపీ నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రపంచం విజేతలను మాత్రమే గుర్తిస్తుంది

● శాస్త్రవేత్త డాక్టర్ నాడగౌడ



మాట్లాడుతున్న డాక్టర్ వీఆర్ నాడ గౌడ

గుంటూరు (విద్య) సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం ఎప్పుడూ విజేతలను మాత్రమే గుర్తిస్తుందని బెంగళూరులోని యూఆర్ రావ్ శాటిలైట్ సెంటర్ ప్రాజెక్ట్ అసోసియేట్ డైరెక్టర్, శాస్త్రవేత్త డాక్టర్ వీఆర్ నాడగౌడ పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం జరిగిన ఇంజనీర్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. అంతరిక్ష సాంకేతికతను నేటితరం యువత అందిపుచ్చుకోవాలని సూచిం చారు. నైపుణ్యాలను పెంపొంది ంచుకుంటూ ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని స్కైరూట్ ఏరో స్పేస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీఎస్ కిరణ్ మాట్లాడుతూ భారత దేశానికి అవసరమైనది ఉద్యోగాల కోసం వెతికే యువత కాదని, ఉద్యోగాలను సృష్టించే ఇంజనీర్లు అవసరమని అన్నారు. ప్రతిభను వినియోగించి కొత్త పరిశ్రమలు, అవకాశాలను సృష్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు, విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, విజ్ఞాన్స్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ..ఒకరి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శివరామకృష్ణ

యడ్లపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంఘీజ్‌ఖాన్ పేట పంచాయతీ శివారు గ్రామం సంగం గోపాలపురంలో కుటుంబ సభ్యుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వేల్పూరి శ్రీనాథ్(36) ఆదివారం సాయంత్రం తన భార్య అక్క కొడుకైన పోట్లూరి విష్ణుతో కలసి మద్యం సేవించాడు. కొద్ది సేపటికి వారి మధ్య మాటామాట పెరిగి ఘర్ష ణకు దారితీసింది. అదే గ్రామానికి చెందిన మల్ల వరపు చందుమణికంఠ, రావూరి విజయ్ అక్కడకు వచ్చి విష్ణుతో కలసి శ్రీనాథ్‌ను విచక్షణా రహితంగా కొట్టారు. దాడి అనంతరం ఇంటికి వెళ్లిన శ్రీనాథ్ చాతిలో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యుల కు చెప్పారు. వారు వెంటనే యడ్లపాడులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన వైద్యం కోసం చిలకలూరి పేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు శ్రీనాథ్‌ను పరీక్షించి అప్పటికే మృతిచెంది నట్లు నిర్ధారించారు. మృతుని అన్న సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ స భ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడిపై డిప్యూటీ ఈఓ విచారణ



విచారణ నిర్వహిస్తున్న ఉప విద్యాశాఖాధికారి సురేష్



కర్లపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా గతంలో పనిచేసిన మద్దెన గోపీపై విద్యా శాఖ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డికి తల్లిదండ్రులు, విద్యార్థులు ఫిర్యాదు చేశారని బాపట్ల జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.సురేష్ సోమవారం తెలిపారు. ఎన్‌సీసీ కార్యక్రమంలో విద్యార్థులకు మంజూరైన దుస్తులు, అలవెన్స్‌లు కాజేయడమే కాక పలు అవకతవకలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. గోపీపై విచారణకు డీఈవో శ్రీరామ్ పురుషోత్తం ఆదేశాల మేరకు చింతాయపాలెం హైస్కూల్‌లో విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. తల్లిదండ్రులను, విద్యార్థులను విచారించామని వాస్తవ రికార్డులను పరిశీలించి పూర్తి నివేదికలను డీఈఓకు అందజేస్తామని సురేష్ విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు విజయశ్రీ, మనోరంజనీ, ప్రధానోపాధ్యాయులు వేణు మాదవ్ ఉన్నారు. సురేష్ విచారణ జరుపుతున్న సమయంలో పాఠశాల వద్ద ఎస్ఎంసీ ఉపాధ్యక్షురాలు పిట్టు నాగలక్ష్మి, కుమార్తె పాఠశాల బయట ఉండగా.. వెనిగండ్లలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సస్పెండ్ అయిన పేరం మస్తాన్‌రెడ్డి కొంత మంది విద్యార్థులు, తల్లిదండ్రులతో అక్కడికి చేరుకున్నాడు. ఈ సమయంలో కుమార్తెను ఫొటోలు తీస్తున్న మస్తాన్‌రెడ్డిని ప్రశ్నిస్తే.. దాడికి పాల్పడ్డాడని నాగలక్ష్మి తెలిపింది. దీంతో అతనిపై దాడి చేయాల్సి వచ్చిందని వివరించింది. నాగలక్ష్మి బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స కోసం చేరారు. పోలీసులు మస్తాన్‌రెడ్డి అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాగలక్ష్మి, పేరం మస్తాన్‌రెడ్డి ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. వెనిగండ్లలో తన సస్పెండ్‌కు కారణమైన గోపీపై ఫిర్యాదు చేసేందుకు తాను వచ్చినట్లు మస్తాన్‌రెడ్డి తెలిపారు.

ఏపీ పీజీ సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్లో స్వల్ప మార్పులు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు ఏపీ పీజీసెట్-2025 కౌన్సెలింగ్ షెడ్యూల్లో స్వల్ప మార్పులు చేసినట్లు ఏపీ పీజీసెట్ ప్రవేశాల కన్వీనర్ ఆచార్య రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలింగ్ పేర్ల నమోదు ప్రక్రియ ఈ నెల 17 వరకు, ఆన్‌లైన్ విద్యార్హత సర్టిఫికెట్ల పరిశీలన 18 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్‌ను ఈ నెల 20 లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఈ నెల 22న ప్రవేశాలు కల్పిస్తామని, ఈ నెల 23 నుంచి 25 లోపు సంబంధిత కళాశాలల్లో విద్యార్థులు చేరాలని ఆయన సూచించారు. పీజీ తరగతులు ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఏఎన్‌యూ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కేంద్రంలో క్యాప్, స్పోర్ట్స్, ఎన్ఎస్ఎస్ క్యాటగిరి అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని వెల్లడించారు. దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన తేదీలను త్వరలో ప్రకటిస్తామని కన్వీనర్ తెలిపారు.

అట్టహాసంగా మన్నవ మోహన కృష్ణ పుట్టినరోజు వేడుకలు

● హాజరైన ప్రజా ప్రతినిధులు, కూటమి ముఖ్యనేతలు



ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, అరవిందబాబు, టీడీపీ నేత సుఖవాసితో కలిసి కేక్ కట్ చేస్తున్న మన్నవ

గుంటూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ పుట్టినరోజు వేడుకలు గుంటూరులో అట్టహాసంగా జరిగాయి. మన్నవ మోహనకృష్ణ యూత్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ గ్రౌండ్‌లో నిర్వహించిన పుట్టినరోజు వేడుకలో వేలాది మంది పాల్గొన్నారు. టీడీపీ కార్యకర్తలు, మన్నవ మోహన కృష్ణ అభిమానులు, ఆత్మీయులు భారీ సంఖ్యలోగా పాల్గొన్నారు. మన్నవ మోహన కృష్ణకు గజమాలలతో స్వాగతం పలికారు. యూత్ సభ్యులు, అభిమానుల కేరింతల మధ్య మన్నవ మోహన కృష్ణ భారీ కేక్ కట్ చేశారు. ఈ జన్మదిన వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎమ్మెల్యే గళ్ళా మాధవి, చదలవాడ అరవింద్ బాబు, వేగేశ్న నరేంద్ర వర్మ, భాష్యం ప్రవీణ్, మహ్మద్ నసీర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఏపీఐడీసీ చైర్మన్లు డేగల ప్రభాకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, వజ్రణం హరిబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ తన జన్మదినాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన తన ఆత్మీయులకు కృతజ్ఞతలు తెలిపారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలియచేసి, తనను ప్రోత్సహించి, పార్టీలో, ప్రభుత్వంలో తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు, తనను అనునిత్యం ప్రోత్సహించే నందమూరి బాలకృష్ణకు ధన్యవాదాలు తెలియజేశారు. చంద్రబాబు, లోకేశ్ అడుగుజాడల్లో నడుస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి, తెలుగు దేశం పార్టీకి అంకిత భావంతో సేవలు అందిస్తానని మన్నవ తెలిపారు. మన్నవ మోహన కృష్ణ తన జన్మ దినం సందర్భంగా సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గుంటూరులోని మాతృశ్రీ పిల్లల ఆశ్రమంలో అనాథ పిల్లలకు స్కూల్ యూనిఫాంలు, పుస్తకాలు అందించారు. ఆ తరువాత ఆసుపత్రిలో పండ్లు పంచారు. తరువాత అనురాగ్ ఓల్డేజ్ హోంలో వృద్ధులకు అన్నదానం చేశారు.



మోహనకృష్ణ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్సీ ఆలపాటి, డేగల

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

27 నుంచి వీణా అవార్డ్స్ నాటిక, నాటక పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న సాయి మాధవ్ తదితరులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వీణా అవార్డ్స్-2025 నాటిక, నాటక పోటీలను దసరా సెలవుల్లో ఈ నెల 27 నుంచి ప్రారంభమవుతాయని సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. కళల కాణాచి ఆర్ఎస్ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు 21 ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. 9 పద్య, ఐదు సాంఘిక నాటకాలు, ఏడు సాంఘిక నాటికలు ప్రదర్శిస్తారని వెల్లడించారు. ఉత్తమ ప్రదర్శనకు ఏఆర్ కృష్ణ జాతీయ పురస్కారం రూ.12,116, బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారం రూ.25వేలు, వేద గంగోత్రి వరప్రసాద్ రంగస్థల పురస్కారం 11,116 ప్రదానం చేస్తామని చెప్పారు. పద్య నాటకాల్లో రూ.లక్ష, బంగారు వీణ, రూ.75 వేలు, వెండి వీణ, రూ.50 వేలు, కాంస్య వీణ, సాంఘిక నాటకాలకు రూ.60 వేలు, బంగారు వీణ, రూ.50 వేలు, వెండి వీణ, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా అందిస్తామన్నారు. ప్రతి నాటకానికి రూ.30-50 వేలు వరకు ప్రదర్శన పారితోషికం ఉంటుందన్నారు. కళల కాణాచి ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్ మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం పద్య నాటకాలు, సాయంత్రం సాంఘిక నాటిక, నాటకాలు ప్రదర్శనలు ప్రదర్శిస్తారని తెలిపారు. చెరుకుమల్లి సింగారావు, వేమూరి విజయభాస్కర్, గోగినేని కేశవరావు, హకీంజాని, భవానీ, మల్లేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో..

రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం కృషి

● ఏపీ, సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమి చైర్మన్ రవి



రవిని సత్కరిస్తున్న సుబ్బారావు, ప్రవాసాంధ్రులు

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సారథ్యంలో రాష్ట్రాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు ఏపీ సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమి చైర్మన్ మండలపు రవి పేర్కొన్నారు. అమెరికాలోని న్యూ జెర్సీలో ప్రవాసాంధ్రులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సవాళ్లను, వేగంగా మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే విజేతలుగా నిలుస్తారన్నారు. సభలో పాల్గొన్న మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, ఇతర వక్తలు మాట్లాడుతూ దేశంలోనే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఏపీని రవి ముందు వరుసలో ఉంచుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని భీమినేని శ్రీనివాస్, శ్రీనాథ్ పర్యవేక్షించగా, చిల్లర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సాదర స్వాగతం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి



మాట్లాడుతున్న కొమ్మాలపాటి


నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నూతన డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు సాదర స్వాగతం పలుకుతున్నామని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి మాట్లాడుతూ మాట ప్రకారం డీఎస్సీని పూర్తిచేసిన సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తుది జాబితాను మంత్రి నారా లోకేష్ ప్రకటించారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన వెంటనే సచివాలయంలో మెగా డీఎస్సీ ఫైల్‌పై మొదటి సంతకం చేసి.. హామీని నెరవేర్చిన మంచి ప్రభుత్వంగా మరోసారి నిరూపించుకున్నారని కొనియాడారు. 150 రోజుల్లో విద్యా శాఖ అనేక వడిదుడుకులను అధిగమించి మెగా డీఎస్సీ-2025 పూర్తి చేసినందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు. తుది జాబితా ఎంపికలో విజయవంతమైన అభ్యర్థులందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కోటిరెడ్డి, నాయకుడు దండ అనిల్‌కుమార్, కొంగర రమేష్‌బాబు, వర్ల బాబురావు పాల్గొన్నారు.

150 రోజుల్లోనే..

డీఎస్సీ ప్రక్రియ లోకేశ్‌కే చెల్లింది : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి లోకేశ్ పట్టుదల, పక్కా ప్రణాళికతో వైసీపీ ప్రభుత్వానికి సాధ్యం కాని మెగా డీఎస్సీ అమలు ఆచరణసాధ్యమైందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు అభ్యంతరాలు 100కు పైగా న్యాయ వివాదాలను అధిగమించి లోకేశ్ కేవలం 150 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేయడం గొప్ప విషయమని కొనియాడారు. 2014-19లో 18 వేల పోస్టులతో డీఎస్సీ అమలు చేసిన చంద్రబాబు ప్రభుత్వం, నేడు 16,347 పోస్టులతో మెగా డీఎస్సీకి కార్యరూపమిచ్చిందని పేర్కొన్నారు. 1994 నుంచి నేటి వరకు టీడీపీ హయాంలోనే రాష్ట్రంలో సుమారు 2 లక్షల టీచర్ పోస్టులు భర్తీ కావడం చారిత్రాత్మక మైలురాయి అని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యారంగాన్ని భ్రష్టుపట్టించిన వైసీపీ ప్రభుత్వ అనాలోచిత విధానాల స్థానంలో లోకేశ్ ప్రవేశపెట్టిన నూతన సంస్కరణలు రాష్ట్ర విద్యా రంగాన్ని జాతీయ స్థాయిలో అందరిని ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.

నాగార్జున సాగర్ క్రస్ట్‌గేట్లు మూసివేత



మూసివేసిన నాగార్జున సాగర్ క్రస్ట్‌గేట్లు

విజయపురిసౌత్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్ అధికారులు క్రస్ట్‌గేట్లను సోమవారం మూసివేశారు. సాగర్ జలాశయం నీటి మట్టం 587.60 అడుగులు ఉంది. ఇది 305.86 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 4,949, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,536, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 50,685 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 50,685 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

రేపు జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నరసరావుపేట కల్చరల్,సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వారధి వార్షిక పోటీలు బుధవారం లింగంగుంట్లలోని శంకరాభారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు డీఈఓ ఎల్.చంద్రకళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిబేట్, వ్యాస రచనలో ప్రభుత్వ పాఠశాలల 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. మానసిక ఆరోగ్యం పెరుగుదలపై పాఠశాలల పాత్ర, భారతదేశ పరిస్థితుల దృష్ట్యా ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించిన మూడు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అనే అంశాలపై వ్యాసరచన, అభ్యసన పెంపుదలపై సామాజిక మాధ్యమాల పాత్ర లేదా భారతదేశ అభివృద్ధికి ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన లక్ష్యాలు అనే అంశాలపై వక్తృత్వ పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీలు ఉదయం 9.30 గంటల ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

మెగా డీఎస్సీ..

మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో..

గుంటూరు (విద్య) సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఓ, కలెక్టరేట్ కార్యాలయంలో జాబితా ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఇతర సమాచారం కోసం డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌లో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాల కోసం డీఈఓజీఎన్‌టీ బ్లాగ్ స్పాట్.కాంలో చూడాలని సూచించారు.

స్మార్ట్ న్యూ రైస్ కార్డులతోనే బియ్యం పంపిణీ

● ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్

● జిల్లాలో 1123 దుకాణాల ద్వారా 4,71,382 రైస్ కార్డులు

బాపట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ న్యూ రైస్ కార్డుల ద్వారానే బియ్యం పంపిణీ జరుగుతుందని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్ తెలిపారు. స్మార్ట్ న్యూ రైస్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జేసీ మాట్లాడుతూ జిల్లాలో 1123 చౌకధరల దుకాణాలు నడుస్తున్నాయన్నారు. వాటి పరిధిలో 4,71,382 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. రైస్ కార్డులకు బదులుగా వాటి స్థానంలో స్మార్ట్ న్యూరైస్‌కార్డులను ప్రభుత్వం ఇస్తుందన్నారు. 15వ తేదీ నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించిన మేరకు పంపిణీ ప్రక్రియను ప్రారంభించామన్నారు. జిల్లాకు 4.71 లక్షల స్మార్ట్ న్యూ రైస్ కార్డులు వచ్చాయన్నారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వచ్చి కార్డులు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు ఎంపీడీవోలు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి అమీర్‌బాషా, డీఎల్‌డీవో విజయమ్మ, సచివాలయాల కో ఆర్డినేటర్ యశ్వత్, ఉపకలెక్టర్ లవన్న, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్ సలీమా తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ న్యూ రైస్ కార్డులను విడుదల చేస్తున్న ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్, ఆర్డీవో గ్లోరియా, డీఎస్‌వో అమీర్‌బాషా తదితరులు

గాలికుంటువ్యాధుల టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలోని రైతులు గాలికుంటువ్యాధుల టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్ తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌లను సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అంటువ్యాధుల నుంచి పశుసంపదను కాపాడటం కోసం 100శాతం ఉచితంగానే టీకాలు వేస్తామన్నారు. జిల్లాలో 4.03 లక్షల గేదెలు, ఆవులు, ఎద్దులకు గాలికుంటు టీకాలు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో పి.గ్లోరియా, ఉపకలెక్టర్ లవన్న, కమిషనర్ జి.రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించి పురోగతిని తెలుసుకోవాలి : కమిషనర్



వ్యర్థాలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వార్డులో ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమాలు గురించి శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు తెలుసుకోవాలని కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం పలు వార్డులలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. డ్రైనేజి పూడికతీత పనులు వేగవంతం చేయాలన్నారు. 21వ వార్డులోని ఆంజనేయ అగ్రహారం పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటంతో ఇంజనీరింగ్ సిబ్బందిని పిలిపించి శుభ్రం చేయించారు. 13వ వార్డు ఏబీఎం కాంపౌండ్‌లో రోడ్డు మార్జిన్ చదును చేసే పనులను, కలెక్టరేట్ రోడ్డు వెంట పిచ్చిమొక్కల తొలగింపును పరిశీలించారు. 16వ వార్డు శీలంవారిపాలెంలో పర్యటించిన ఆయన చెత్తనిల్వ పాయింట్‌లను పరిశీలించారు. ప్రధానరోడ్లు, అంతర్గత రోడ్ల పక్కనే చెత్తనిల్వలు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. సీజనల్ జ్వరాలు ఎక్కువగా ప్రబలుతున్న దృష్ట్యా క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు సయ్యద్ నజీర్, సీహెచ్ కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్‌డే వేడుకలు

బాపట్లరూరల్, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతిని పురస్కరించుకొని సోమవారం 58వ ఇంజనీర్స్‌డే వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బెంగుళూరు హెచ్‌సీఎల్ టెక్నాలజి ఆర్కిటెక్చర్ డాక్టర్ బి.పూర్ణచంద్రరావు పాల్గొని మాట్లాడుతూ నేటియువతరం పరిశోధన రంగంవైపు పయనించి సమాజ సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. మరో అతిథి డాక్టర్ రోజా వడ్లమూడి ఆధునిక సాంకేతిక రంగంలో రాణించటానికి పాటించాల్సిన సలహాలను, పెంపొందించుకోవాల్సిన సరికొత్త ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన విషయాల వివరాలను అందించారు. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో చదివి అత్యున్నత స్థానానికి ఎదిగిన డాక్టర్ బి.పూర్ణచంద్రరావును, సాంకేతిక రంగంలో రాణిస్తున్న డాక్టర్ రోజా వడ్లమూడిని నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ కళాశాల కల్పిస్తున్న ఆధునిక వనరులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరి దొడ్డపనేని వెంకయ్యచౌదరి, కోశాధికారి కోట వీరబ్రహ్మయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి, అధ్యాపకులు, అధ్యాపకర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు

వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో....

బాపట్ల, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల అసోసియేట్‌డీన్ డాక్టర్ డీడీ స్మిత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ డి.భాస్కరరావు, విశ్రాంత అసోసియేట్ డీన్ డాక్టర్ శివలకుమార్, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజి సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.ఏడుకొండలు, డాక్టర్ ఎన్టీఆర్ ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్ బేగ్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటితరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.కృపావతి, డాక్టర్ బి.రవిబాబు, డాక్టర్ కెవిఎస్.రామిరెడ్డి, డాక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, బోధన, బోధనేతరసిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరతలేదు : కలెక్టర్

బాపట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కొరతలేదు కావున రైతులు నిర్భయంగా వచ్చి యూరియా పొందవచ్చని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్ 35 కేంద్రాల ద్వారా 4983 మంది రైతులకు 220 మెట్రిక్‌టన్నుల యూరియా పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఇంకా 220 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా యజ్ఞనారాయణ

బాపట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ బాపట్ల టౌన్ అధ్యక్షుడిగా దండే యజ్ఞ నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతోపాటు కార్యదర్శిగా గణేశుల శివరామకృష్ణ, కోశాధికారిగా బొనిగల రాజేంద్రప్రసాద్‌లను ఎన్నుకున్నారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో నూతన కార్యవర్గంతో పీడీజీ ఎంజెఎఫ్ లయన్ సి.బాలస్వామి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం సరస్వతీ మెమోరియల్ బాలికోన్నత పాఠశాల, కళాశాలలకు 4 శానిటరీ డిస్పోజబుల్ మిషన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కో ఆర్డినేటర్ గోపాలం రఘుపతిరావు, బూరుగుల సంగమేశ్వరశాస్త్రి, అలపర్తి శ్రీనివాసరావు, గుండ్రెడ్డి సత్యనారాయణ, కోళ్ళపూడి సుధాకర్ గుప్తా, బొమ్మిశెట్టి మాణిక్యారావు, తిమ్మన గౌరి ప్రసాద్‌శర్మ, గుండ్రెడ్డి నాగేశ్వరరావు, పఠాన్ శ్రీనుబాషా తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులకు పరిష్కారపత్రం ఇవ్వాలి

● ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్



పీజీఆర్ఎస్‌లో ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘనాయకులు

బాపట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదైన అర్జీలను పరిష్కరించిన తదుపరి సంబంధిత వ్యక్తులకు ఖచ్చితంగా ధ్రువీకరణపత్రం ఇవ్వాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 164 అర్జీలు నమోదయ్యాయి. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నందున అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 14,458 అర్జీలు నమోదయ్యాయని వాటిని ఈనెలాఖరులోగా పరిష్కరించాలన్నారు.

● సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్త పాటించాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్ తెలిపారు. స్వస్థ్‌నారి స్వశక్తిపరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. అందులో భాగంగా అన్ని ప్రాంతాలలో సచివాలయాల స్థాయిలో వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, ఉపకలెక్టర్ లవన్న, సమగ్రశిక్షాభియాన్ ఏపీసీ నాగిరెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు

● ఎన్నికలకు ముందు బీసీలకు చేసిన వాగ్దానాలను అమలు పర్చటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ కోరారు. ఈ విషయమై సోమవారం పీజీఆర్ఎస్‌లో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. చీలురోడ్డు సెంటర్‌లో స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకొని వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 34 శాతం రిజర్వేషన్, స్థానిక సంస్థలలో రిజర్వేషన్ అమలు పర్చాలన్నారు. కార్యక్రమంలో ఉల్చి శ్రీను, కె.రాంబాబు, రామ్మోహనరావు, సాయికుమార్ పాల్గొన్నారు.

పరిష్కారవేదికను సద్వినియోగం చేసుకోవాలి : ఆర్డీవో

రేపల్లె, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదికను డివిజన్‌లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. పరిష్కార వేదికకు ఐదు అర్జీలు అందాయని ఆర్డీవో తెలిపారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన మహి శ్రావణ్‌కుమార్ గ్రామంలోని 1వ వార్డులో వర్షపు నీరు నిల్వ ఉందని, వాటిని తొలగించాలని కోరారు. భట్టిప్రోలు గ్రామానికి చెందిన బొట్టు నాగమల్లేశ్వరరావు ఆయుర్వేద వైద్యశాల వెనుక గల ప్రదేశంలో వర్షపునీరు తొలగించాలని కోరారు. పట్టణంలోని 12వ వార్డుకు చెందిన ఎంసీపీ ఫంక్షన్ హాలు నుంచి వచ్చే మురుగునీరు వలన దుర్వాసన వస్తుందని, అనారోగ్యం బారినపడుతున్నామని సమస్యను పరిష్కరించాలని కోరారు. పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సీవీ మోహన్‌రావు బేతపూడి గ్రామం నుంచి తురకపాలెం గ్రామం వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలను ఆయా అధికారులకు తెలిపి పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

కర్లపాలెం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ ఇందిరానగర్‌లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో సోమవారం మండల విద్యాశాఖాధికారి విజయశ్రీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను, విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.రామారావు, ఉపాధ్యాయులు షేక్ రహంతుల్లా, శివనాగమణి, ఆషాపర్వీన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కర్లపాలెం ఎంపీ రాజుపాలెం మండల పరిషత్ ఉర్దూ పాఠశాల విద్యార్థులకు యాక్షన్ టవర్స్ హైదరాబాద్ వలి సహకారంతో నోట్‌బుక్స్‌ను మండల విద్యాశాఖాధికారి విజయశ్రీ చేతులమీదగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా, మాజీ ఎంపీటీసీ షేక్ బాజి, ప్రధానోపాధ్యాయులు జి.రామారావు, షేక్ మస్తాన్, పఠాన్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ ఎంపికలు

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్-14, 17 బాలబాలికల మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు ముగిశాయని మండల కో ఆర్డినేటర్ ఎం.ప్రశాంతబాబు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం బాలబాలికలకు క్రీడా ఎంపికలైన కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, బ్యాడ్మింటన్‌ల విభాగాలలో నిర్వహించటం జరిగిందని తెలిపారు. సుమారు 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి ఎస్‌వి.శివబాబు పర్యవేక్షించారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ కరీముల్లా, నాగలక్ష్మి, రవికృష్ణ, రాము, రామిరెడ్డి ఈ ఎంపికల ప్రక్రియలో పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు డివిజన్ స్థాయిలో నిర్వహించే పోటీలలో పిట్టలవానిపాలెం మండలం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని ప్రశాంతబాబు తెలిపారు.

లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేయాలి : తహసీల్దార్

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పిట్టలవానిపాలెం తహసీల్దార్ కార్యాలయం లో తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం వీఆర్వోలు, మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులకు నూతనంగా అందజేసే రైస్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సచివాలయాల వారీగా 11,670 రైస్ కార్డులను మండలంలోని 30 రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాలని వారికి సూచించారు.

పాఠశాలకు మోటరు బహుకరణ

బాపట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అజాద్ మున్సిపల్ మోడల్ ప్రైమరీ పాఠశాలకు డాక్టర్ చల్లా రామ్మోహనరావు సోమవారం వాటర్ మోటారు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడు సహకారం అందిస్తానని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు పురం వెంకట సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యను పెంచటం, బడి వయస్సు పిల్లలందరిని బడిలో చేర్చుటకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.రామకృష్ణ, మల్లేష్, పివి.రమణ, శ్రీనివాసరావు, గద్దె ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పలు క్రీడలలో హైవెండ్ విద్యార్థుల ప్రతిభ

కర్లపాలెం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీలలో హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారని హైవెండ్ హైస్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ సాయిమహేంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రాంగణంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఖోఖో పోటీలలో అండర్-17లో పి.భానుచంద్రారెడ్డి, పి.సాయిహర్ష, అండర్-14లో నంగు అరుణ్‌కుమార్‌రెడ్డి, డి.ధరణరెడ్డి, కె.శివఅంజిరెడ్డి, కబడ్డీలో అండర్-17లో పి.భానుచంద్రారెడ్డి, అండర్-14 పి.హసన్‌ఖాన్, వాలీబాల్‌లో అండర్-14లో ఎస్.చరణ్‌కుమార్‌రెడ్డి, ఎన్.కిషోర్‌బాబు, ఎన్.సంతోష్, పి.వెంకటసాయి, అండర్-17లో ఎం.నరసింహారెడ్డి, ఖోఖోలో మహాలక్ష్మి, తరుణ్మయి, భవానీ, నందిని, చెస్‌లో అక్షయ, తరుణ్మయి, షటిల్ బ్యాడ్మింటన్, తరుణ్మయి, గీతిక, వాలీబాల్‌లో మహాలక్ష్మి, షట్‌పుట్‌లో మహాలక్ష్మీలు మండలస్థాయిలో విజేతలుగా నిలిచారు. ఈ క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు చాంధిని, అంజనేయప్రసాద్, వెంకటజ్యోతి, ఛైర్మన్ ఉదయచంద్రరావు, పీఈటీ వీరశేఖర్, ఉపాధ్యాయులు రఫీ, షర్మిల పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలింపులో హై డ్రామా

బాపట్లరూరల్, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి) : కొండుభొట్లవారిపాలెం రైల్వేగేటు సమీపంలో లారీలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని శనివారం అర్ధరాత్రి తరలిస్తుండగా విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. అయినప్పటికి రేషన్ బియ్యంతో కూడిన లారీని రేషన్ మాఫియావాళ్ళు తప్పించేశారు. ఆ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావటంతో రూరల్ పోలీసులు అప్రమత్తమై రేషన్ బియ్యం తరలించిన లారీని, రేషన్ బియ్యం తరలిస్తున్న గోపి, లింగయ్య, డ్రైవర్ సుధీర్‌లను అదుపులోకి తీసుకొని సోమవారం కేసు నమోదు చేశారు. అతి త్వరలోనే అక్రమంగా తరలించిన రేషన్ బియ్యాన్ని కూడా స్వాధీనం చేసుకోవటం జరుగుతుందని పోలీసులు తెలిపారు.

మహిళలు గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

చెరుకుపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుళ్ళపల్లిలో శ్రీరామచంద్ర నర్సింగ్ హోమ్ వద్ద సోమవారం మహిళలకు రొమ్ము గర్భాశయ ముఖద్వార పరీక్షల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన పూర్ణసుధా క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నాలుగురోజుల మెగా వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. ప్రముఖ ప్రసూతి వైద్యనిపుణురాలు డాక్టర్ కడియాల సమత మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహనతోనే దాన్ని అధిగమించగలమన్నారు. శ్రీరామచంద్ర నర్సింగ్‌హోమ్ వైద్యులు కొడాలిమోహన్, కొడాలి రజనీకాంత్, విజయలక్ష్మి, కొడాలి కీర్తిచంద్ర, రమ్య, వాసిరెడ్డి వన్య, ప్రముఖ పారిశ్రామికవేత్త కొడాలి గోపాలకృష్ణ, కొడాలి కిషోర్‌బాబు, కొడాలి జీవన్ కుమార్, జ్యోత్స్న, తలసిల విజయనాగ్, ఫింక్ సంస్థ వైద్యులు జెన్‌టాల్పోట్, కారల్ హోబక్, లూయిస్కోర్, బెంగుళూరు వైద్యురాలు జయంతి, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న వైద్యుల బృందం

కరాటే పోటీలలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

చెరుకుపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కర్నూలులో జరిగిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ 2025 పోటీలలో మండలంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు. అరవింద్, జోషీనలు స్వర్ణ పతకాలు, అనన్య, నమస్వి వెండి పతకాలు, రేవంత్, మోహన్‌గౌతమ్, తౌఫిక్, ప్రద్యున్, రామ్‌వేర్నియా, సహస్రలు కాంస్య పతకాలు సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ పైనం ఏడుకొండలురెడ్డి, ప్రిన్సిపాల్ సుభాష్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులను అభినందించారు.



మెడల్స్‌తో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

శ్మశాన స్థల కేటాయింపునకు ప్రతిపాదనలు

● ఆంధ్రజ్యోతి వార్తకు స్పందించిన ఆర్డీవో

వేమూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు మార్జినే శ్మశానం.. అంటూ సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వెలువడిన కథనానికి రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి స్పందించారు. మండలంలోని కాకర్లమూడి గ్రామంలో నివసిస్తున్న 22 దళిత కుటుంబాలకు వారిలో ఎవరైనా మృతి చెందితే ఖననం చేసేందుకు శ్మశాన వాటిక లేదని తెలియజేస్తూ కథనంలో వివరించడం జరిగింది. స్పందించిన ఆర్డీవో పేపర్ క్లిప్పింగ్‌ను వాట్సాప్ ద్వారా వేమూరు తహసీల్దార్‌కు పంపి తక్షణమే దళితుల సౌకర్యార్థంగా శ్మశాన స్థలానికి అర ఎకరం భూమి కేటాయించాలంటూ ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. స్పందించిన తహసీల్దార్ సుశీల ఆర్డీవోకు శ్మశాన స్థలం కేటాయింపు నిమిత్తం ప్రతిపాదనలను ఆర్డీవోకు పంపారు.

ప్రభుత్వ గడువులోగా సర్వేలు పూర్తి చేయాలి : ఎంపీడీవో

వేమూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రారంభించిన పలు సర్వేల కార్యక్రమాన్ని గడువు తేదీ లోగా పూర్తి చేయాలని ఎంపీడీవో పెద్దింటి రవికుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 17 గ్రామాల పరిధిలోని పంచాయతీలు, సచివాలయ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్క్ ఫ్రం హోం సర్వే కార్యక్రమం ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. మండల పరిధిలో ఇప్పటికే కేవలం 50 శాతం మాత్రమే పూర్తి చేశారని, గడువులోగా పూర్తి చేయాలని కోరారు. వాహన మిత్ర లబ్ధిదారులను నిబంధనల మేరకు గుర్తించాలన్నారు. వారి ద్వారా 19వ తేదీలోగా దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్ చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు వహించాలన్నారు. మురుగు కాల్వల వద్ద శానిటేషన్ చేయించాలని ఆదేశించారు. ఎంపీడీవో శేఖర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లకు జరిమానాలతో నష్టపోతున్నాం

కొల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇసుక రవాణానే తమ జీవనాధారమని ట్రాక్టర్ల యజమానులు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పెసర్లంక, ఆవులవారిపాలెం, కొల్లూరుకు చెందిన ట్రాక్టర్ల యజమానులు తహసీల్దార్‌ను కలుసుకుని ఇటీవల రెవెన్యూ, పోలీసు అధికారులు ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్లును స్వాధీనం చేసుకుని జరిమానాలు విధించడంతో తాము నష్టపోతున్నామన్నారు. తహసీల్దార్ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని యజమానులకు తెలిపారు.



లబ్ధిదారులకు స్మార్ట్ న్యూరైస్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, ఆర్డీవో పి.గ్లోరియా తదితరులు

ప్రతిష్ఠాత్మకంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా స్మార్ట్ న్యూ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పట్టణంలోని 11వవార్డులో సోమవారం సాయంత్రం స్మార్ట్ న్యూ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి స్మార్ట్ రేషన్‌కార్డులు అందుతాయని చెప్పారు. ఈ కార్డు ద్వారా ప్రజలకు సేవలు మరింత చేరువ అవుతాయని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎస్‌వో అమీర్‌బాషా, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్ సలీమా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, వార్డు ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, యూనిట్ ఇన్‌చార్జి సూరగాని రాజశేఖర్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ఫణికుమార్ పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులు పంపిణీకి సిద్ధం : తహసీల్దార్

వేమూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ కార్డులు పంపిణీ సిద్ధంగా ఉన్నట్లు తహసీల్దార్ సుశీల తెలిపారు. సోమవారం 17 గ్రామాలకు చెందిన వినియోగదారుల కార్డులు ప్రభుత్వం నుంచి కార్యాలయానికి చేరాయన్నారు. 14576 మంది పాత కార్డుదారులు ఉన్నారని, కొత్తగా 2512 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. మంగళవారం కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి 25వ తేదీలోగా లబ్ధిదారులందరికి చేరే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు జంపనిలో...

● హాజరు కానున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు జంపని గ్రామంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. రేషన్ షాపు నెంబరు 10 వద్ద పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అయినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం గురించి మాట్లాడకపోవటం శోచనీయమని ఏపీటీఎఫ్ కన్వీనర్ టి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏపీటీఎఫ్ రేపల్లె జోన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ నాలుగు విడతలుగా ఇవ్వాల్సిన టీఏ, డీఏ బకాయిలను ఇంతవరకు చెల్లించలేదన్నారు. తక్షణమే 12వ పీఆర్సీ కమిటీని నియమించి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి 57 జీవోలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు జే.సుబ్బారావు, వై.చెన్నకేశవులు, కె.వెంకటరత్నం, శేషు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పంట నమోదును వేగవంతం చేయాలి

రేపల్లె, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మండల వ్యవసాయశాఖాధికారి మహేష్‌బాబు అన్నారు. స్థానిక వ్యవసాయశాఖాధికారి కార్యాలయంలో రైతుసేవాకేంద్రసహాయకులకు సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ పంట, ఈకేవైసీని ఈనెల 30వతేదీ లోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సేవాకేంద్రాల సహాయకులు పాల్గొన్నారు.

అర్చకులు అనుభవించే పొలాలకు అడంగల్‌లో పేర్లు నమోదు చేయాలి

రేపల్లె, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అర్చకులకు గతంలోలాగా వారు అనుభవించే పొలాలకు అడంగల్ నమోదు చేసి శిస్తు చెల్లించుకోవాలని నవ్యాంధ్ర అర్చక, ఈనామ్‌దారుల సేవాసమితి అధ్యక్షుడు నారాయణంశరత్‌చంద్ అన్నారు. సోమవారం ఆర్డీవో రామలక్ష్మికి నవ్యాంధ్ర అర్చక ఈనామ్‌దారుల సేవాసమితి ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ అడంగల్‌లో పేర్లు లేకపోవటం అలాగే శిస్తు చెల్లించుకోకపోవటంవలన ప్రభుత్వం నుంచి వచ్చే ఏవిధమైన ఫలసాయం అర్చకులకు అందటం లేదన్నారు.

18న గ్రంథాలయాభివృద్ధి కమిటీ ఎంపిక

బాపట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఉత్తర్వులను అనుసరించి ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు గ్రంథాలయాభివృద్ధి కమిటి ఎంపిక కార్యక్రమం జరుగుతుందని బాపట్ల శాఖా గ్రంథాలయం అధికారి ఎ.శివాజీగణేశన్ తెలిపారు. గ్రంథాలయాలపై ఆసక్తి ఉన్న వారు కమిటీలో పాల్గొనాలని కోరారు.

డివిజన్ స్థాయి పోటీలకు 96 మంది క్రీడాకారులు ఎంపిక

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ స్థాయి పోటీలకు 96 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు మండల కో-ఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. భట్టిప్రోలులోని టీఎంరావు ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీలను పీహెచ్‌సీ వైద్యులు మొహిసినతాజ్ ప్రారంభించారు. 96 మంది బాపట్ల డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారు.

ఆరోగ్యం.. మన చేతుల్లోనే..!

● కాస్త ఆలోచించి తినండి !
● వీధుల్లో చిరుతిండ్లతో అనారోగ్యం
● విజృంభిస్తున్న వైరల్ ఫీవర్లు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో ఏం జరిగిందో అర్థం కావడం లేదు. నీటి కలుషితమా... వైరల్ ఇన్‌ఫెక్షన్లా.. అనేది కనుగొనేందుకు వైద్యులు సతమతమవుతున్నారు. తురకపాలెంలో జరిగిన వరుస మరణాలతో జిల్లా వైద్య యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడా కూడా నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తూ వస్తోంది. పల్నాడు జిల్లాలోనూ గత కొద్ది రోజులుగా సీజనల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తలనొప్పి, జలుబు, జ్వరాలతో ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ప్రస్తుత వర్షాకాలం వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో ఆహారం విషయంలో ఎంత మాత్రం అలసత్వం వహించినా ఆసుపత్రులపాలై రూ.వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఎంత ఖర్చు చేసినా ఒక్కోసారి ప్రాణం పోయే పరిస్థితి ఏర్పడుతుంది. మనం తినే ఆహారం పట్ల కొద్ది రోజులు తగు జాగ్రత్తలు పాటించకపోతే పైప్రాణాలు పైనే పోతాయన్న వైద్యుల మాటలు ప్రతి ఒక్కరూ విని తీరా వాటిని పాటించి తీరాల్సిందే.



జానపాడు రోడ్డు పక్కన ఫాస్ట్‌ఫుడ్ తింటున్న యువత

అన్నీ రోడ్లపైనే..

ఫాస్ట్‌ఫుడ్, చికెన్ మసాలా, పానీపూరి బండి, చికెన్, మటన్ దుకాణాలు ఎక్కడ చూసినా రోడ్ల పక్కనే కనిపిస్తున్నాయి. వాహనాలు వేగానికి లేచిపడే దుమ్మూధూళి అంతా వాటిపైనే పడిపోతున్నా మూతలు పెట్టకుండా విక్రయించేస్తున్నారు. మాంసం విక్రయించే వ్యక్తి చేతులు అపరిశుభ్రంగా ఉంటే.. బ్యాక్టీరియా సులువుగా ఒకరి నుంచి మరొకరికి చేరి రోగాలు తెచ్చిపెడతాయి. మిఠాయిలోనూ వాడే పలు రకాల రంగులతో ఆరోగ్యానికి హానికరమే. ఏ ఆహార పదార్థాలైనా.. వాటిని జాగ్రత్త చేయడంతోనే ఆరోగ్యం దాగి ఉంటుంది.



మాయబజార్ వీధిలో బండివద్ద పానీపూరీ తింటున్న యువకులు

ఈగలు వాలిన పదార్థాలు తింటే టైఫాయిడ్, విరోచనాలు బారిన పడి విలవిల్లాడే ప్రమాదం ఉంది.

చేతుల శుభ్రత ముఖ్యం..

ప్రతి వ్యక్తి తన ఆరోగ్యం తన చేతుల్లోనే ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవడం లేదు. ఆహార పదార్థాలను తినేముందు.. చేతుల శుభ్రత పాటించకపోతే అతి ప్రమాదకరమైన అతిసార వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అపరిశుభ్రమైన చేతులతో ఆహారం తింటే జలుబు, అతిసారం, హైపటైటిస్-ఏ కంటి సంబంధిత ఇన్‌ఫెక్షన్‌తో బాధపడే అవకాశం ఉంది. మల మూత్ర విసర్జన తర్వాత చేతులు శుభ్రత లేకుండా ఆహారం తింటే మరింత అనారోగ్యానికి గురికావాల్సి వస్తుంది.

నీరు,ఆహారంలో జాగ్రత్త పాటించాలి : డాక్టర్ ఓగూరి కోటయ్య



జూన్ నుంచి అక్టోబరు వరకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని సీనియర్ వైద్యులు ఓగూరి కోటయ్య తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో ప్రజలు వైరల్ ఫీవర్లతో బాధ పడుతున్నారని.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తాగే నీరు, తీసుకునే ఆహారం పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులను తట్టుకునేందుకు ఆకు కూరలు, డ్రై ఫ్రూట్స్, గుడ్లు, పాలు, పండ్లు వంటి బలమైన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు.



ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన డాక్టర్ కోడెల

● సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల అభివృద్ధికి కృషి
● నేడు 6వ వర్ధంతి కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు

సత్తెనపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శాసన సభ స్పీకర్‌గా పని చేసిన డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు సత్తెనపల్లి, నరసరావుపేట నియోజక వర్గాల్లో ప్రజా సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారు. రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. నకరికల్లు మండలం కండ్లకుంటలో 1947 మే 2న కోడెల శివప్రసాదరావు జన్మించారు. వైద్యుడిగా, రాజకీయ నాయకుడిగా పల్నాడు ప్రాంతంలో.. పల్నాడు పులిగా ప్రజల్లో ముద్ర వేసుకున్నారు. 2014లో సత్తెనపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్ మొట్టమొదటి స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో తారకరామ సాగర్‌ను నిర్మించి ఎన్‌టీఆర్ పార్కును, వావిలాల ఘాట్‌ను నిర్మించారు. తారక రామ సాగర్‌లో 46 అడుగుల ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తారక రామ సాగర్ చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి నియోజక వర్గంలో.. స్వచ్ఛ సత్తెనపల్లి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మరుగు దొడ్లను నిర్మించే కార్యక్రమాన్ని విజయవంతంగా చేశారు. చేతుల శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించి యునెసెఫ్ నుంచి అవార్డు పొందారు. సత్తెనపల్లి నియోజకవర్గం విద్యాభివృద్ధిలో భాగంగా కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయించారు. నియోజక వర్గంలోని అన్ని మతాలకు చెందిన శ్మశాన వాటికలను అభివృద్ధి చేశారు. సత్తెనపల్లి పట్టణంలో మోడల్ పోలీసు స్టేషన్‌ను నిర్మించారు. ముస్లింల కోసం షాదీఖానాను నిర్మించి, రాష్ట్ర స్థాయి అగ్నిమాపక శిక్షణా కేంద్రాన్ని సత్తెనపల్లిలో ఏర్పాటు చేయించారు. 50 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేశారు. రోగులకు వైద్య సేవలు అందేలా కృషి చేశారు. సత్తెనపల్లి పట్టణంలో రోడ్డు అభివృద్ధి చేయించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూశారు. రైల్వే స్టేషన్ రోడ్డులో స్టేడియం అభివృద్ధికి కూడా ఎంతగానో కృషి చేశారు. 2014 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్‌గా సమర్థంగా సభను నడిపించారు. రాష్ట్ర విభజన అనంతరం కొత్త అసెంబ్లీని ఏర్పాటు చేయించడంలో కీలక పాత్ర పోషించారు. స్పీకర్‌గా ఉన్న సమయంలో నిత్యం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించే వారు. సత్తెనపల్లి నియోజక వర్గ ప్రగతికి ఆయన చేసిన కృషి ఎవ్వరూ మరువ లేరు. పక్కనే నరసరావుపేట నియోజక వర్గ అభివృద్ధికి కూడా ఆయన ఎంతో కృషి చేశారు. 2018లో రాష్ట్రస్థాయి మునిసిపల్ అధికారులు నరసరావుపేటను మోడల్ టౌన్‌గా ప్రకటించారు. కోటప్పకొండ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. 2015లో నరసరావుపేట మునిసిపాలిటీలో వంద సంవత్సరాల వేడుకలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడతో కలసి నిర్వహించారు. 1983లో తెలుగుదేశం పార్టీ ద్వారా నరసరావుపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు 1985, 1994, 1999లో కూడా నరసరావుపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాష్ట్ర హోం మంత్రిగా, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మంత్రిగా పని చేశారు. 2019 సెప్టెంబరు 16న ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. కోడెల శివ ప్రసాదరావు రాజకీయ స్ఫూర్తి ఎంతో మంది రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తుంది. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పని చేసిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆరవ వర్ధంతి నేడు సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, అభిమానులు భారీ ఎత్తున నిర్వహించనున్నారు.

ర్యాంకుల శ్యామల..

డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపిక



మారుపూడి శ్యామల

పొన్నూరుటౌన్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో పొన్నూరు మండలం చింతలపూడి గ్రామానికి చెందిన మారుపూడి శ్యామల మూడు విభాగాల్లో ఉద్యోగానికి అర్హత సాధించింది. స్కూల్ అసిస్టెంట్ విభాగం బయాలజికల్ సైన్స్‌లో జిల్లాలో 17వ ర్యాంకు, పీజీటీ బోటని విభాగంలో 29వ ర్యాంకు, పీజీటీ బయోలాజికల్ సైన్స్ 59వ ర్యాంకును సాధించింది. ఈడబ్ల్యూఎస్ కోటా కింద బయోలాజికల్ సైన్స్‌లో జిల్లాలో మూడవ ర్యాంకును శ్యామల సాధించింది. ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపికైన శ్యామల బయోలాజికల్ సైన్స్ ఉద్యోగాన్ని ఎంపిక చేసుకున్నట్లు తెలిపింది. ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించిన ఆమెను పొన్నూరు వాసులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

గురువు నేర్పిన సిలబస్‌తో.. రాష్ట్రస్థాయి 2వ ర్యాంక్



షేక్ మీర్జా

చేబ్రోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో పీజీటీ(గణితం) పోస్టు కోసం నిర్వహించిన నియామక పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సెలెక్టెడ్ లిస్ట్‌లో షేక్ మీర్జా బీసీ ఈ కేటగిరిలో రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంక్ సాధించింది. మీర్జా తండ్రి రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ కాగా తల్లి గృహిణి, సామన్య కుటుంబంలో జన్మించి ఈ ఘనత సాధించిన మీర్జాకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బీసీ-ఈ కోటాలో జోన్ 3లో మొదటి ర్యాంక్ సాధించిన షేక్ మీర్జా రాష్ట్రంలో బీసీ-ఈ కోటాలో రెండవ స్థానంలో, మొత్తం రాష్ట్ర స్థాయి మెరిట్‌లో 135వ ర్యాంక్‌తో ఉత్తీర్ణత సాధించారు. ఇంగ్లీష మీడియంలో గణితం సబ్జెక్టుగా పరీక్ష రాసిన వారిలో ఆయన ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా మీర్జా మట్లాడుతూ తనకు ఇంటర్మీడియట్‌లో విద్యనేర్పిన గురువు చందు పాపారావుని గుర్తు చేసుకున్నారు. తన గురువు నేర్పిన సిలబస్ తన విజయానికి సహాయపడిందని అన్నారు.



అరవింద వారధి వద్ద కృష్ణానది ప్రవాహం

కొనసాగుతున్న వరద ప్రవాహం

● వరద నీటిలోనే తల్లిదండ్రులతో ఇళ్లకు విద్యార్థులు

కొల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం కొల్లూరు మండలం అరవింద వారధి వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. గాజుల్లంక వద్ద చిన్నరేవులోకి వరద నీరు ప్రవహిస్తూ దోనేపూడి కరకట్ట దిగువున పోతార్లంక చప్టాపైకి పారుతోంది. పాఠశాలలకు వెళ్లే తమ పిల్లల కోసం లంక గ్రామాల్లోని తల్లిదండ్రులు దోనేపూడి వచ్చి.. చప్టాపై ప్రవహిస్తున్న వరద నీటిలోనే ఇళ్లకు తీసుకెళ్తున్నారు. వరద చప్టాలపై వెళ్తున్న సమయంలో అక్కడ రాకపోకలు జరగకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ, అక్కడ ఎవరూ కానరావడం లేదు. కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాలు, పులిచింతలతో పాటు వాగులు, వంకలు ద్వారా 3.20 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజీకి చేరుతోంది. 3.97 లక్షల క్యూసెక్కుల వరద నీరు బ్యారేజీ నుంచి విడుదలైతే మొదటి ప్రమాద హెచ్చరిక, 5.67 లక్షలు క్యూసెక్కులు విడుదల చేస్తే రెండవ ప్రమాద హెచ్చరిక అధికారులు జారీ చేస్తారు. ప్రస్తుతం వరద ప్రవాహం నిలకడగా ఉందని మొదటి ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే అవసరం లేదని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు.



వరద నీటిలో పాఠశాల నుంచి పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

నిర్మించారు.. నిర్వహణ మరిచారు..

● నిరుపయోగంగా అగ్రి టెస్టింగ్ ల్యాబ్
● నష్టపోతున్న రైతులు



నిరుపయోగంగా ఉన్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్

మాచర్ల రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందాన తయారైంది మాచర్ల నియోజకవర్గ రైతుల పరిస్థితి. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేందుకు ఏర్పాటు చేసిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిరుపయోగంగా మారింది. దీంతో రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరీక్షించుకునేందుకు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.. దీనిపై సరైన అవగాహన లేని రైతులు డీలర్లు ఇచ్చిన విత్తనాలనే వినియోగించి పంటలు సాగు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

రూ. 55 లక్షలతో నిర్మాణం

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 2022లో రూ. 55 లక్షలతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్మాణం చేపట్టారు. ఈ ల్యాబ్‌లో రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరీక్షించుకొని వినియోగించుకోవచ్చు. అధునాతన హంగులతో భవన నిర్మాణం కూడా పూర్తయింది. 2023లో అట్టహాసంగా ప్రారంభించారు. అయితే భవనంలో అవసరమైన హాట్ ఎయిర్ ఓవెన్, అనలిటికల్ బ్యాలెన్స్ వాక్యూమ్ పంపు, వాటర్ బాత్ షేకర్ వంటి సామగ్రిని ఏర్పాటు చేయలేదు. సిబ్బంది నియామకం కూడా జరపలేదు. దీంతో రెండేళ్లుగా ఈ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ రైతులకు అందుబాటులోకి రాలేదు. రైతుల అభివృద్ధికి పెద్దపీట వేసే కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

పరికరాలు అందుబాటులోకి రాగానే...

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్వహణకు అవసరమైన సామగ్రి అందుబాటులోకి రాలేదు. అవి రాగానే ల్యాబ్‌ను నిర్వహిస్తాం. పరికరాలు లేకపోవడం వల్ల నాణ్యతా పరీక్షలు ప్రారంభం కాలేదు. ల్యాబ్‌లో సామగ్రి ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

పోలీస్ వర్గాల్లో.. కలకలం

● వైసీపీ హయాంలో పల్నాడులో బరితెగించిన పోలీసులు
● కారుతో ఢీ కొట్టి టీడీపీ నేత జల్లయ్య హత్య
● కేసు విచారణ తారుమారు చేసిన ఇద్దరు సీఐల సస్పెన్షన్
● నిందితులను తప్పించడమే కాదు... హతుని బంధువులే నిందితులుగా కేసు



గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడులో కళంకిత సీఐల సస్పెన్షన్ వ్యవహారం పోలీసు వర్గాల్లో సంచలనం సృష్టించింది. గత వైసీపీ హయాంలో జరిగిన టీడీపీ నేతల హత్యల్లో అత్యధిక ఘటనల్లో ప్రత్యక్షంగానో లేదంటే పరోక్షంగానో పోలీసుల ప్రమేయం ఉందనేది బహిరంగ రహస్యమే. నాడు టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గూండాలు దారుణంగా మతమార్చిన కేసులో పోలీసులు వ్యవహరించిన తీరు పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఈ కేసు విచారణను తారుమారు చేసిన ఇరువురు సీఐలు షమీవుల్లా, జయకుమార్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.... 2022 జూన్ 3న దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గుండాలు దారుణంగా హత్య చేశాయి. ఈ కేసులో పోలీసులు నిందితులను వదిలేయడమే కాకుండా అతడి బంధువులనే నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. పల్నాడులో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన అరాచకాలు, హత్యలపై ఆంధ్రజ్యోతి వరుసగా ప్రచురించిన కథనాలపై ప్రభుత్వం స్పందించింది. దీనిపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణలో అప్పటి మాచర్ల రూరల్ సీఐ షమీముల్లా, కారంపూడి సీఐ జయ కుమార్‌లు కరుడుగట్టిన వైసీపీ ఫ్యాక్షనిస్టుల మాదిరిగా వ్యవహరించి కేసు విచారణనే తారుమారు చేసినట్లు విచారణలో తేలింది. దీంతో వారిరువురిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం షమీవుల్లా ఒంగోలు డీటీసీలో, జయకుమార్ బాపట్ల ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో విధులు నిర్వహిస్తున్నారు. అంతేగాక ఈ కేసులో అప్పటి గురజాల డీఎస్పీ జయరామ్ ప్రసాద్, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డిలపై కూడా చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏకంగా హత్య కేసులో నిందితులను తప్పించడమే కాకుండా హతుని బంధువులనే నిందితులుగా పెట్టారంటే సంబంధిత ఉన్నతాధికారులకు తెలియకుండా జరిగే అవకాశమే ఉండదనే వాదన పోలీస్ వర్గాల నుంచే వినిపిస్తోంది.

హత్య కేసులో నిందితులు సాక్షులుగా...

సాక్షులు నిందితులుగా

సినిమాల్లో కూడా చూడని, ఊహకందని రీతిలో పల్నాడులో పోలీసులు పట్టపగలు జరిగిన దారుణ హత్య కేసులో నిందితులను సాక్షులుగా, సాక్షులను నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదు చేసి పోలీసులు ఏ స్థాయికి దిగజారి ప్రవర్తించారో అర్థం చేసుకోవచ్చు. చంద్రయ్య తరహాలోనే పల్నాడులో జరిగిన జల్లయ్య హత్య కూడా సంచలనం సృష్టించింది. చంద్రయ్య హత్య జరిగిన ఆరు నెలలకు అంటే 2022 జూన్ 3న జంగమహేశ్వరపాడుకు చెందిన టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గుండాలు దారుణంగా హతమార్చారు. దీనిలో భాగంగానే దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన గ్రామ టీడీపీ నాయకుడు జల్లయ్య గ్రామాన్ని వదిలి గురజాల పరిధిలోని మాడుగులలో తలదాచుకుంటున్నాడు. గ్రామంలో రాజకీయ ఆధిపత్యం కోసం జల్లయ్యను హతమార్చేస్తే తమకు ఎదురుండదని వైసీపీ నాయకులు భావించారు. అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ప్రధాన అనుచరుడైన జంగమహేశ్వరపాడుకు చెందిన రౌడీషీటర్ మన్నెయ్య, ఆయన సోదరులు జల్లయ్యను హతమార్చేందుకు అప్పటికే సిద్ధమయ్యారు. ఇదిలాఉంటే 2022 జూన్ 3న జల్లయ్య రావులాపురం గ్రామంలో జరుగుతున్న తన అన్న కుమార్తె వేడుకకు వస్తుండగా సమాచారం తెలుసుకున్న వైసీపీ నాయకులు, పిన్నెల్లి ప్రధాన అనుచరుడైన మన్నెయ్య నేతృత్వంలో జంగమహేశ్వరపాడు శివారు కాకిరాల అటవీ ప్రాంతంలో దారి కాచి కత్తులతో పొడిచి దారుణంగా హత మార్చారు. ఈ హత్య కూడా తీవ్ర సంచలన సృష్టించింది. అయితే ఈ హత్యకు పాల్పడిన మన్నెయ్య, మరి కొందరిపై హత్య కేసు బనాయించకపోగా జల్లయ్యతో పాటు ఉండి ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సాక్షులైన జల్లయ్య మేనమామలనే నిందితులుగా కేసు నమోదు చేశారు. ఎంత దారుణమంటే హత్య కేసులో నిందితులను తప్పించి, సాక్షులనే నిందితులుగా కేసు నమోదు చేశారు. అంతేగాక జల్లయ్యను హత్య చేసిన నిందితులనే ఈ కేసులో సాక్షులుగా పేర్కొనడం నాటి దారుణాలకు పరాకాష్టగా చెప్పవచ్చు. అంతేకాదు జల్లయ్యను హత్య చేయబోతున్నారనే విషయం పోలీసులకు కూడా ముందుగానే తెలుసనేది బహిరంగ రహస్యమే.

పిన్నెల్లి సోదరుల అండతో రెచ్చిపోయిన పోలీసులు

పల్నాడు లో జరిగిన వరుస హత్యలకు నాటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిల పరోక్ష పాత్ర ఉన్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. పల్నాడు ప్రాంతంలో పిన్నెల్లి సోదరులు గడిచిన ఐదేళ్లు అరాచకాలకు తెగబడ్డారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజానీకాన్ని సైతం భయభ్రాంతులకు గురి చేశారు. ఈ క్రమంలో అప్పట్లో జరిగిన హత్యలతో పాటు హత్యాయత్నాలు దాడులు, లూటీలపై కేసులు కూడా నమోదు కాలేదు. సంచలనం సృష్టించిన ఘటనలపై కేసులు నమోదైనప్పటికీ ఎటువంటి దర్యాప్తు జరగలేదు. చంద్రయ్య, జల్లయ్య లాంటి సంచలనం సృష్టించిన హత్య కేసుల్లోనూ విచారణ తూతూ మంత్రంగా సాగింది. ఈ నేపథ్యంలో నాటి చంద్రయ్య హత్యను పునర్విచారణ జరిపించాలంటూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇప్పటికే ఈ కేసును సీఐడీకి అప్పగించింది. జల్లయ హత్యతోపాటు పల్నాడు ప్రాంతంలో జరిగిన అనేక హత్యలు, హత్యాయత్నాలు లూటీలు, దాడులకు సంబంధించిన ఘటనలపై కూడా ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి న్యాయ విచారణ జరిపించాలని పల్నాడు ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు డీడీని అందజేస్తున్న మన్నెం శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు

టీటీడీ ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన మన్నెం శ్రీనివాసరావు, అరుణ దంపతులు తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం అందించారు. ఈ మేరకు సోమవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కలిసి విరాళం డీడీలను అందజేశారు. వారి కుమార్తెలు మన్నెం హారిక పేరిట ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల 116లు, మన్నెం హరిత పేరిట ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.10లక్షల116లు విరాళమిచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, మన్నెం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గుంటూరులో జాతీయ మీడియా ప్రతినిధులు

● రాష్ట్రంలో మూడు రోజుల పర్యటన ప్రారంభం
● వెంగళాయపాలెం, మిర్చి యార్డుల సందర్శన



చింతలపూడిలో పర్యటిస్తున్న జాతీయ మీడియా బృంద సభ్యులు

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖల సహకారంతో రాష్ట్రంలో మూడు రోజుల జాతీయ మీడియా పర్యటనను సోమవారం ప్రారంభమైంది. ఈ పర్యటన ప్రముఖ జాతీయ, ప్రాంతీయ మీడియా నిపుణులను ఒక చోట చేర్చి, వినూత్నమైన అట్టడుగు స్థాయి పాలనా కార్యక్రమాల అమలును పరిశీలించి.. నివేదించడానికి వీలు కల్పిస్తుంది. మీడియా ప్రతినిధి బృందానికి పత్రికా సమాచార కార్యాలయం (పంచాయతీ రాజ్) డీడీ అదితి అగర్వాల్ నేతృత్వం వహిస్తున్నారు.

వెంగళాయపాలెంలో స్వచ్ఛ రథం పైలట్ ప్రాజెక్ట్ సందర్శన

తొలి రోజున మొదటిగా గుంటూరు గ్రామీణ మండలంలో ఉన్న వెంగళాయపాలెం గ్రామ పంచాయతీలోని స్వచ్ఛ రథం పైలట్ ప్రాజెక్ట్ అమలును జర్నలిస్టులు పరిశీలించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రారంభించిన స్వచ్ఛ రథం అనేది ఒక మొబైల్ యూనిట్ గృహాల నుంచి ఉత్పన్నమయ్యే స్క్రాప్, వ్యర్థ పదార్థాలను మార్పిడి చేసుకుని, సమాన బరువు కలిగిన రోజువారి నిత్యావసరాలను అందిస్తుంది. గ్రామ స్థాయిలో వ్యర్థాల విభజనను ప్రోత్సహించి స్థిరమైన పారిశుధ్యాన్ని ప్రోత్సహించడమే ఈ చొరవ లక్ష్యం. దీని గురించి అన్ని వివరాలు అడిగి తెలుసుకొన్నారు.

ఆసియాలోనే అతిపెద్ద మిర్చి యార్డ్ సందర్శన

మీడియా బృందం గుంటూరులోని ఆసియాలోనే అతిపెద్ద మిర్చి మార్కెటింగ్ యార్డ్‌ను సందర్శించింది. అక్కడ వారు మిర్చి యార్డ్ కార్యదర్శి చంద్రికతో సంభాషించి, క్షేత్రస్థాయి వాణిజ్య, మార్కెటింగ్ కార్యకలాపాలతో పాటుగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతుందో తెలుసుకున్నారు. మిర్చి వేలం ఎలా జరుగుతుంది, ఈనామ్ అమలు తదితర విషయాలను అడిగి తెలుసుకొన్నారు. మధ్యాహ్నం, మీడియా బృందం చింతలపూడి గ్రామ పంచాయతీకి చేరుకుని అక్కడ స్వామిత్వ పథకం అమలు గురించి తెలుసుకున్నారు. ఈ చొరవ గ్రామీణ నివాసితులకు చట్టబద్ధమైన ఆస్తి హక్కులను అందిస్తుంది, వారు సంస్థాగత రుణాన్ని పొందటానికి, భూమిని మానిటైజ్ చేయడానికి, వివాదాలను తగ్గించడానికి వీలు కల్పిస్తుంది. ఈ పథకం వారి ఆర్థిక స్థిరత్వాన్ని, భూ యాజమాన్య భద్రతను ఎలా మెరుగుపరిచిందో లబ్ధిదారులు తెలుపుతూ ప్రభుత్వానికి వారి కృతజ్ఞతను వ్యక్తం చేశారు. ఈ సందర్శనలో పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ తాజా ఏఐ-ఆధారిత సాధనమైన సభాసార్‌ను గ్రామసభలో ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరణ పొందారు. ఈ పర్యటనలో పంచాయతీ రాజ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తోట చందన, అధికారులు, సిబ్బంది, స్థానిక కమ్యూనిటీ నాయకులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



నూతనశాఖను ప్రారంభిస్తున్న సీజీఎం అరుణ్‌కుమార్

చినగంజాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు లక్ష్యమని ఏపీజీబీ డీజీఎం ఎం.అరుణ్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చినగంజాం శాఖ నూతన కార్యాలయాన్ని నూతన భవనంలోనికి మార్చిన సందర్భంగా సోమవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖాతాదారుల సహకారంతోనే బ్యాంకు అభివృద్ధి చెందుతుందన్నారు. ఖాతాదారులకు ఆర్థికంగా చేయూతనివ్వడమే బ్యాంకు లక్ష్యమని అరుణ్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ సయ్యద్ యూసఫ్‌అలీ, బ్రాంచ్ మేనేజర్ కె.మధుసూధనరావు, మేనేజర్ డి.పోతురాజు, సిబ్బంది ఎస్.శిరీష టి.నాగఫణీంద్ర, షేక్.జానిబేగం, మురళిసింగ్, అనిల్‌కుమార్, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

పథకాలతో ఆర్థికాభివృద్ధి చెందాలి



ఎగ్ కార్ట్ బండిని ప్రారంభిస్తున్న పోద వీరయ్య

చినగంజాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావులు అన్నారు. స్థానిక సోపిరాల రైల్వేగేటు కూడలిలో వెలుగు డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్ కార్ట్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం గద్దె పెదసుబ్బారావు మాట్లాడుతూ గ్రామంలోని శ్రీరామ గ్రూపులోని గుండూరి సృజన అనే డ్వాక్రా మహిళకు షాపు పెట్టుకొనేందుకు ఉచితంగా రూ.50 వేలను అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ప్యూర్ అనే లక్ష్యం కింద దీనిని ఇచ్చినట్లు తెలిపారు. ఒకే కుటుంబంలోని ఇద్దరు పని చేసుకుంటూ దీని మీద బతకవచ్చన్నారు. నెలకు సుమారుగా రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు సంపాదించవచ్చన్నారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, టీడీపీ నాయకులు సందు శ్రీనివాసరావు, పర్వతరెడ్డి పార్థసారిధి, నరహరి శ్రీనివాసరావు, గుండ్రెడ్డి నరసింహారావు, పల్లపోలు శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

ఎలుకల మందు తిని యువకుడి ఆత్మహత్య

బల్లికురవ, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ప్రేమవివాహం వాయిదాపడడంతో జీవితంపై విరక్తి చెందిన కొమ్మినేనివారిపాలేనికి చెందిన బొజ్జా ఎబేపరరావు(20) ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ నాగరాజు కథనం మేరకు కొమ్మినేనివారిపాలెం ఎస్టీ కాలనీకి చెందిన ఎబేపరరావు ఒక యువతిని ప్రేమించి ఆమెతో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. వివాహం రోజురోజుకు వాయిదా పడుతుండడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ నెల 9న ఎలుకల మందు తిని అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఒంగోలు వైద్యశాలకు తరలించగా అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సోమవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



హిమబిందుతో ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వేటపాలెం బాలికోన్నత పాఠశాలకు చెందిన పి.హిమబిందు ఎంపికైంది. జిల్లా జూనియర్ పోటీలు బాపట్ల మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరగ్గా, అక్కడ హిమబిందు ఉత్తమంగా రాణించింది. దీంతో ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు, సోమశేఖర్, దేవభిక్షం, శ్రావణి ప్రత్యేకంగా అభినందించారు.

చెన్నుపల్లికి విశ్వకర్మ ఐకాన్ అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న శ్రీనివాసాచారి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశ్వకరమ్మ ఐకాన్ అవార్డుకు ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని సిద్ధిపేటలో ఆదివారం విరాట్ విశ్వకర్మ విజ్ఞాన అధునిక ధార్మిక కళాపరిషత్, ఇండియాన్ కల్చరల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డు అందజేశారు. శ్రీనివాసచారికి సిద్ధిపేట వీరబ్రహ్మేంద్రస్వామి మఠం పీఠాధిపతులు వీరజ ధర్మేంద్రస్వామి, బతుకమ్మతల్లి గ్రంథకర్త వంగల శాంతి కృష్ణలు అవార్డు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ ప్రధాన కార్యదర్శి కుందుర్తి సీతారామాంజనేయులు, పలు జిల్లా సంఘ నాయకులు పాల్గొన్నారు.

వెండితెర అవార్డు అందుకున్న నిర్మాత సందిరెడ్డి



వెండితెర అవార్డు అందుకుంటున్న సందిరెడ్డి శ్రీనివాసరావు

అద్దంకి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వీవీ ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెండితెర అవార్డులలో అద్దంకి పట్టణానికి చెందిన సినీ నిర్మాత సందిరెడ్డి శ్రీనివాసరావుకు దక్కింది. విజయవాడ సమీపంలోని కేఎల్ యూనివర్శిటీలో ఆదివారం రాత్రి జరిగిన వెండితెర అవార్డుల కార్యక్రమంలో సందిరెడ్డి శ్రీనివాసరావు రూపొందించిన జై జవాన్ డాక్యుమెంటరీ ఫిల్మ్‌కు దక్కింది. నిర్మాత శ్రీనివాసరావు అవార్డును పలువురు నటీనటుల చేతుల మీదగా అందుకున్నారు. వెండితెర అవార్డు అందుకున్న సందిరెడ్డి శ్రీనివాసరావు కు పలువురు అభినందనలు తెలిపారు.

మహిళా దొంగల ముఠా అరెస్టు

● రూ.7.50 లక్షల నగదు, కారు స్వాధీనం



పట్టుబడిన కారు, నగదుతో డీఎస్పీ నరసింగప్ప, సీఐ శేఖర్, సిబ్బంది

గోరంట్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళలు ముఠాగా ఏర్పడ్డారు. బ్యాంకుల వద్ద రెక్కీ నిర్వహించడం, పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసుకుని వెళ్తున్న వారిని వెంబడించి ఆ సొమ్ము కాజేయడం మొదలెట్టారు. అలా.. 14 రోజుల వ్యవధిలో వేర్వేరు రాష్ట్రాల్లో ఏకంగా 10 చోరీలు చేశారు. అందుకోసం రెండు కార్లను తీసుకుని, ఇద్దరు డ్రైవర్లను సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఆఖరుకు ఆ మహిళా ముఠాను శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల పోలీసులు పట్టుకున్నారు. అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠా ఆట కట్టించారు. ముఠాలోని ఆరుగురు సభ్యులను ఆదివారం అరెస్టు చేసి, వారి నుంచి రూ.7.50 లక్షల నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రాజ్‌గర్ జిల్లా కడియాసాన్‌సీ గ్రామానికి చెందిన దీప్ మాలా బాయి, పరిత సిసోడియా, రేఖాబాయి, మమత, మాలాబాయి, కారు డ్రైవర్ ప్రదీప్ సిసోడియా పోలీసులకు పట్టుబడిన వారిలో ఉన్నారు. గోరంట్ల పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ నరసింగప్ప.. దొంగల ముఠా అరెస్టు వివరాలను సోమవారం వెల్లడించారు. కడియాసాన్‌సీ గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలు రెండు కార్లను తీసుకుని, చోరీలు మొదలెట్టారు. ఈనెల 3న గోరంట్ల మండలం కొండాపురం గ్రామానికి చెందిన భుజంగరావు స్టేట్ బ్యాంకు(గోరంట్ల శాఖ)లో రూ.3.80 లక్షల నగదు డ్రా చేసుకుని, ద్విచక్రవాహనం సైడ్ బ్యాగులో పెట్టుకుని బయల్దేరాడు. మధ్యలో ఓ దుకాణం వద్ద దుస్తులు కొనుగోలు చేసేందుకు ఆగాడు. ఆయనను బ్యాంకు వద్ద నుంచే రెండు కార్లలో మహిళా ముఠా వెంబడించింది. దుస్తులు కొనుగోలు చేస్తుండగా.. ద్విచక్రవాహనంలోని రూ.3.80 లక్షల నగదును చోరీ చేశాయి. అప్పట్లో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శేఖర్, ఎస్ఐ రామచంద్రయ్య ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. దీప్ మాలాబాయి, పరిత సిసోడియా, రేఖాబాయి, మమత, మాలాబాయి, మరో ఇద్దరు మహిళలు, ప్రదీప్, మరో కారు డ్రైవర్ ముఠా చోరీ చేసినట్లు గుర్తించారు. గోరంట్ల మండలంలో జాతీయర రహదారి పక్కనే కె హోటల్ వద్ద ఆదివారం ఐదుగురు మహిళలు, కారు డ్రైవర్ ప్రదీప్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో వరుస చోరీలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముఠా గత నెల 21 నుంచి ఈనెల 3వ తేదీ మధ్య ఏకంగా పది చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. కడప జిల్లా పులివెందుల, జమ్మలమడుగులో మూడు, తెలంగాణలో మూడు, నంద్యాల జిల్లా, కర్ణాటక, ఒడిశాలో ఒకటి, మరోచోట ఒకటి చొప్పున మొత్తం పది చోరీలు చేసి, రూ.12.59 లక్షలు అపహరించారు. వారి నుంచి మొత్తం 7.50 లక్షలు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులు.. కారుకు సైరన్ ఏర్పాటు చేసుకుని చోరీలకు పాల్పడినట్లు తేలింది. అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసిన సీఐ శేఖర్, ఎస్ఐ రామచంద్రయ్య పేర్లను రివార్డులకు సిఫార్సు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. దర్యాప్తులో చొరవ చూపిన కానిస్టేబుళ్లు వెంకటేష్, వేణుగోపాల్ రెడ్డి, హోంగార్డు ప్రియాంకకు నగదు బహుమతులను డీఎస్పీ అందజేశారు. ముఠాలో మరో ఇద్దరు వహిళలు, డ్రైవర్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ వెల్లడించారు.

అనధికార నిర్మాణాలకు అనుమతులపై సీరియస్

● పూర్వ కమిషనర్, ఏసీపీలపై చర్యలకు ఆదేశం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం హయంలో ఒంగోలు కార్పొరేషన్, టౌన్‌ప్లానింగ్ విభాగంలో చోటుచేసుకున్న అవకతవకలు, అవినీతిపై పురపాలక శాఖ సీరియస్ అయినట్లు సమాచారం. అప్పటి నగర కమిషనరు ఎం.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ (రిటైర్డ్) కే.వెంకటేశ్వర్లుపై చర్యలకు ఆదేశించింది. నగరంలోని పలు భవన నిర్మాణాల్లో నిబంధనలు అతిక్రమించి నిర్మించుకునేందుకు వీరు పరోక్షంగా ప్రోత్సహించారనే ఆరోపణలు ఉన్నాయి. టౌన్‌ప్లానింగ్‌లో జరిగిన అవినీతిపై హైకోర్టు న్యాయవాది డి.ఎస్.సుబ్బారావు విజిలెన్స్, ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఒంగోలు కార్పొరేషన్‌కు సంబంధించి ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ) కట్టకుండానే బిల్డింగ్ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేశారు. అందులో ప్రధానంగా బండ్లమిట్ట టీబీ రోడ్ కూడా ఉండగా, నగరంలోని ఊరచెరువు, అద్దంకి బస్టాండ్‌లో నిర్మించిన షాపింగ్ మాల్స్ పలు ప్రాంతాల్లోనూ అనుమతులు లేకుండా జీ+2 పర్మిషన్ తీసుకుని అదనపు అంతస్తులు నిర్మించడంపైనా ఫిర్యాదులు ఉన్నాయి. వ్యాపార సంస్థల నిర్మాణాలకు భవన నిర్మాణం ఖర్చులో 10 శాతం కార్మిక శాఖకు లేబర్ సెస్ రూ.కోట్లలో చెల్లించాల్సి ఉండగా, మొక్కుబడిగా సెస్ విధించి రూ.కోట్లు దిగమింగేసినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో కార్పొరేషన్‌కు, కార్మిక శాఖకు భారీ నష్టం వాటిల్లింది. ఈ క్రమంలో ఫిర్యాదుల మేరకు ఏసీబీ అధికారులు రికార్డులు స్వాధీనం చేసుకుని విచారణ చేయడంతో అవినీతి బయటపడింది. దీంతో పూర్వ కమిషనరు ఎం.వెంకటేశ్వరరావు, ఏసీపీ కేవీలపై చర్యలకు ఆదేశిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

'సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పేదలకు అండ'

మద్దిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పేదలకు ఎంతో అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే విజయకుమార్ చెప్పారు. మండలంలోని పలు గ్రామాలలో సోమవారం ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 21 గ్రామాలలో 85 మందికి ఆ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పుగుండూరి నాగేశ్వరావు, మండవ జయంత్ బాబు, అడక స్వాములు, మందపల్లి శ్రీనివాసరావు, పోతినేని శ్రీనివాసరావు, మండవ వెంకటస్వామి, మన్నం రాజా, మన్నం కృష్ణ, దాసరి శిల్పా సౌందర్య, దాసరి రమేష్ బాబు, మార్నేని సుబ్బారావు, మార్నేని కృష్ణారావు, మార్నేని రాఘవరావు, దుగ్గినేని నరసింహారావు, మోనపాటి రామకృష్ణ, గడ్డం రవి, మండవ గోపీనాథ్ పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ.332

ఒంగోలు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పొగాకు వేలంకేంద్రం 2లో సోమవారం జరిగిన వేలంలో పొగాకు మేలు రకం కిలో రూ.332 పలికింది. వేలానికి మొత్తం 1055బేళ్లు రాగా 881 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. కనిష్ట ధర రూ.104 పలికింది.

పశువులకు గాలికుంటు టీకాలు



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ డాక్టర్ బ్రహ్మయ్య

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలల్లో చేపడుతున్న పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగపర్చుకోవాలని అద్దంకి పశువైద్యశాల ఏడీఏ డాక్టర్ బ్రహ్మయ్య అన్నారు. సోమవారం మండలంలోని నాగులపాడు గ్రామంలో టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబరు 15 వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. పశుపోషకులు ఎటువంటి అపోహలకు పోకుండా పశువులకు టీకాలను వేయించాలని తెలిపారు.

ఘనంగా 'జేసీఐ' ముగింపు వేడుకలు

అలరించిన చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

డాక్టర్ కామేపల్లి సీతారామయ్యకు ఉత్తమ బిజినెస్‌మెన్ అవార్డు

సూరే ఏడుకొండలుకు కమలపత్ర అవార్డు



డాక్టర్ సీతారామయ్యతోపాటు పలువురిని సత్కరిస్తున్న జేసీఐ ప్రతినిధులు

ఒంగోలు కల్చరల్, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) వారోత్సవాల ముగింపు వేడుకలు సోమవారంరాత్రి ఘనంగా జరిగాయి. కాపు కల్యాణ మండపంలో జరిగిన వేడుకల సందర్భంగా నిర్వహించిన పోటీల్లోని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఫ్యాన్సీ డ్రస్ పోటీలు ఆకట్టుకున్నాయి. ముగింపు సభలో జేసీఐ ఇంటర్నేషనల్ కమిషన్ చైర్మన్ ఎన్‌బీ హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు జేసీఐకి ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని, సంస్థ నిర్దేశించిన ప్రతి కార్యక్రమాన్ని ఎంతో విజయవంతంగా నిర్వహిస్తారని అన్నారు. ఈ వారోత్సవాలలో సుమారు 70 పాఠశాలలకు చెందిన 5 వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు జేసీఐ టఅధ్యక్షుడు మేడిశెట్టి వెంకట సుబ్బారావు చెప్పారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యకు ఉత్తమ బిజినెస్‌మెన్ అవార్డు, సూరే ఏడుకొండలుకు కమలపత్ర అవార్డు, డాక్టర్ అంజనీ ప్రియదర్శినిని అవుట్‌స్టాండింగ్ యంగ్ పర్సన్ అవార్డు, గంధవళ్ల రాధా రమణకు సూపర్‌కిడ్ అవార్డులతో సత్కరించారు. అదేవిధంగా పలువురిని ప్రొఫెషనల్ అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో వారోత్సవాల చైర్మన్ శివకోటి రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, సరస్వతి విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి, మాంటిస్సోరి పి.ప్రకాష్ బాబు, జేసీ వీక్ కో చైర్మన్ గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం, కో ఆర్డినేటర్లు ఆత్మకూరు బ్రహ్మయ్య, బొమ్మల శ్రీనివాస రావు, డాక్టర్ జి.రవికుమార్, ఎన్. రామకృష్ణ, కే.వరుణ్ కుమార్, వి.వి.రమణ, మాజేటి గణేష్ పాల్గొన్నారు.

'బౌద్ధంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానులే'



బౌద్ధ ధర్మంపై ప్రచారం చేస్తున్న సభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బౌద్ధంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమని, సర్వమానవ సమానత్వం, సర్వజీవ కారుణ్యం ప్రధానమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బౌద్ధ ధర్మ ప్రచారకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో బౌద్ధ ధర్మ ప్రచార యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐసీడీఎస్ ఆర్‌జేడీ రాఘవరావు మాట్లాడుతూ 2600 ఏళ్ల క్రితమే స్త్రీ, పురుష సమానత్వాన్ని, సర్వమానవ సమానత్వాన్ని గౌతమ బుద్ధుడు తన భిక్షు సంఘంలో అమలు చేశారన్నారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ మాట్లాడుతూ పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కుల అమలులో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గాండ్ల హరిప్రసాద రావు, దాసరి సుందరం, బి.సుబ్బారావు, జార్జి, ప్రసాద్, జి.నాగేశ్వర రావు పాల్గొన్నారు. అంతకు ముందు రాజపానగల్ రోడ్డులోని అబ్దుల్ కలాం విగ్రహం వద్ద ర్యాలీ ప్రారంభమై కొణిజేడు బస్టాండు, గద్దల గుంట మీదుగా మామిడిపాలెం అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించారు.

సొసైటీ భవనానికి స్థలం కేటాయించాలని వినతి



తహసీల్దార్ పుల్లారావుకు వినతిపత్రం అందజేస్తున్న కొండలరావు

పొన్నలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరు పీఏసీఎస్‌కు సొంత భవనం కోసం స్థలాన్ని కేటాయించాలని చైర్మన్ ఉన్నం కొండలరావు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామిని కోరారు. ఈ మేరకు సోమవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. సొసైటీలో సుమారు 14 వేలకుపైగా రైతులు సేవలు పొందుతున్నారన్నారు. రూ.12 కోట్ల మేర రుణాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సొసైటీకి సొంత భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొత్త భవనం నిర్మాణానికి 10 సెంట్ల స్థలాన్ని కేటాయించాలని కొండలరావు కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి స్వామి.. సొసైటీకి అనువుగా ఉండేలా స్థలం కేటాయించాలని స్థానిక తహసీల్దార్ పుల్లారావును ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, పల్లపోతు రమేష్‌బాబు, దాసరి కృష్ణారావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

తైక్వాండోలో కారుమంచి యువకుల సత్తా

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కారుమంచి గ్రామానికి చెందిన మేడికొండ మణికంఠం, గాలి శివరామకృష్ణ అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో సత్తా చాటారు. ఈనెల 13,14 తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలిలోని స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో మేడికొండ మణికంఠ బంగారు, గాలి శివరామకృష్ణ రజత పతాకాన్ని సాధించారు. వీరికి శిక్షణ ఇచ్చిన బ్లాక్‌బెల్ట్ ఫస్ట్ డాన్ దగ్గుమాటి విజయ్ ఇరువురినీ ప్రశంసించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

పొన్నలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ జె.శివరామకృష్ణ సూచించారు. ఈనెల 15 నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలను పరిష్కరించాలని టీచర్ల నిరసన



మండల కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ కొండపి జోన్ ఆధ్వర్యంలో టంగుటూరులోని మండల ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఉపాధ్యాయులు సోమవారం నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.హనుమంతరావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి ఐ.విజయసారథి, మండలాల శాఖల అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు పోలేరమ్మ ఆలయ హుండీ కానుకల లెక్కింపు

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కామేపల్లి పోలేరమ్మ ఆలయంలోని హుండీ కానుకలను బుధవారం లెక్కిస్తామని ఆలయ ఈవో భైరాగి చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ, బ్యాంకు అధికారుల సమక్షంలో ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు.

సీఎం కాన్ఫరెన్స్‌లో జేసీ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో సోమవారం ప్రారంభమైన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌ను ప్రత్యక్ష ప్రసారాన్ని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఇతర అధికారులు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వీక్షించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లాల వారీగా వివిధ అంశాలపై కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేస్తున్నారు. అందుకు సంబంధించి ప్రత్యేక టైం టేబుల్‌ను కూడా రాష్ట్ర అధికారులు రూపొందించారు. ఆయా వివరాలను జిల్లా స్థాయి అధికారులకు తెలియజేసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించాలని ఆదేశించారు.

రణభేరీ పోస్టర్ల ఆవిష్కరణ



రణభేరీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తపట్నం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంకోరుతూ యూటీఎఫ్ నిర్వహించనున్న రణభేరి వాల్‌పోస్టర్లను సోమవారం టీచర్లు ఆవిష్కరించారు. మండలంలోని గమండ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు రవి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు బైకు జాతర కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు కొండారెడ్డి, ప్రభాకరరెడ్డి, ఉమామహేశ్వరరావు, జయరామిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసరావు, మూర్తి పాల్గొన్నారు.

చీమకుర్తిలో మై టీడీపీ యాప్‌పై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

చీమకుర్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలకు బహుళప్రయోజనం చేకూర్చే మై టీడీపీ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం చీమకుర్తి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. పట్టణపార్టీ అధ్యక్షుడు ముప్పూరి చలమయ్య, నాయకులు మన్నం ప్రసాద్, కాట్రగడ్డ రమణయ్య, పూనాటి వెంకట్రావు, అవగనిగడ్డ శేషయ్య, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, పిచ్చయ్య, నాగరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి భూమిపూజ

చీమకుర్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూనంనేనివారిపాలెంలో కమ్యూనిటీహాలు ప్రాంగణం వద్ద బీఆర్ అంబేడ్కర్ విగ్రహనికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రాయపూడి కోటయ్య, వేమా చిన్న కోటేశ్వరరావు, పారాబత్తిన పేరయ్య, యలమందయ్య, బాలకోటేశ్వరరావు, ప్రభాకర్, కొండలరావు పాల్గొన్నారు.

రేపు పల్లామల్లి సొసైటీ మహాజన సభ

చీమకుర్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లామల్లి సహకార సొసైటీ సంఘం మహాజన సభను 17వ తేదీన సొసైటీ ఆవరణలో నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ పారా చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీలో సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

అవీ..ఇవీ..

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికలు

చినగంజాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఖాజీపాలెం కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో అథ్లెటిక్స్ విభాగాలలో పోటీలు నిర్వహించి, క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భోగిరెడ్డి స్వామిరెడ్డి, మారుబోయిన వెంకటరెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి, పోటీలలో ప్రతిభ చూసిన క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్స్ జట్లుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 17న ఉదయం 8గంటల లోపు క్రీడాకారులు హాజరు కావాలన్నారు. 13వ తేదీ వర్షం కురిసిన కారణంగా అథ్లెటిక్స్ ఎంపికలు 14వ తేదీన నిర్వహించలేదని తెలిపారు. పూర్తి వివరాలకు 9542354041, 7416825797 నంబర్లను సంప్రదించాలని వెంకటరెడ్డి తెలిపారు.

కొప్పెరపాడులో స్కూల్ గేమ్స్ పోటీలు



బల్లికురవలో లాంగ్‌జంప్ చేస్తున్న విద్యార్థి

బల్లికురవ, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా తరఫున పలు రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవోలు శ్రీనివాసరావు, రమేష్‌లు ప్రారంభించారు. పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు అండర్-14, అండర్-17 విభాగాలలో వాలీబాల్, కబడీ, లాంగ్ జంప్, హైజంప్ పోటీలలో పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులను డివిజన్ స్థాయికి పంపుతామని ఎంఈవోలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వ్యాయమ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్చరీలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

● సత్తాచాటిన హారిజన్ స్కూల్ విద్యార్థులు



అభినందన సభలో మాట్లాడుతున్న రవికుమార్

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీల్లో ఆర్చరీ విభాగంలో వేటపాలెం హారిజన్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ ప్రదర్శన చేసిన జాన్‌వెస్లీ, నవదీప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్కూల్లో ఏర్పాటు చేసిన అభినందనసభలో పాఠశాల కార్యదర్శి డాక్టర్ పొగడదండ రవికుమార్ వీరిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించిన ఈ ఆర్చరీ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. వారి వెంట ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ పిఎల్ రాజు, చుక్కా శ్రీను, రాంబాబు, జయలక్ష్మీ, ఏబీఎం కళాశాల ప్రిన్సిపల్ శ్రీవాణి తదితరులు ఉన్నారు.

స్కూలుకు ఫర్నీచర్ బహూకరణ



పాఠశాలకు అందజేసిన ఫర్నీచర్‌తో దాత

యద్దనపూడి,(మార్టూరు)సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని గన్నవరం గ్రామంలో ఎస్సీ కాలనీలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలకు సోమవారం ఎడిన్ చారిటబుల్ ట్రస్ట్‌వారు రూ.10 వేల విలువైన ఫర్నీచర్‌ను బహుకరించారు. వారు స్కూలుకు 5 ఎస్ చైర్ లు, ఒక టేబుల్ ను బహుకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు లేళ్లపల్లి సుధీరా వెంకటేశ్వర్లు, లేళ్లపల్లి సుబ్బారావు లు, ఎంఈవో చిలుకూరి గోపి, ఉపాధ్యాయులు పోపూరి సునిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల సందర్శనతో మానసిక ఉల్లాసం



అన్న వితరణ చేస్తున్న సీఐలు

పేరాల(చీరాల), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పనిభారంతో తలమునకలైన సమయంలో ఆలయాలు సందర్శించడం వలన మానసిక ఉల్లాసం కలుగుతుందని సీఐలు సుబ్బారావు, నాగభూషణం పేర్కొన్నారు. పేరాల శ్రీగంగా భ్రమరాంబ సమేత పునుగు రామలింగమల్లేశ్వర స్వామి దేవస్థానం పెద్దరథం కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి సీఐలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులు స్వయంగా వడ్డించారు. గత 27 వారాలుగా జరుగుతున్న అన్నవితరణకు సోమవారం నిహారిక , మరో దాత నాగార్జున లు సహకరించారు. కార్యక్రమాన్ని కమిటీ ప్రతినిధులు అన్నదాత పాండురంగారావు, భాస్కరరావు, రమేష్‌బాబులు పర్యవేక్షించారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శింగరకొండలోని శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు అన్న దానం నిర్వహించారు. వజ్జాఅశోక్ జ్ఞాపకార్థం తండి వజ్జా వెంకట్రామయ్య సౌజన్యంతో ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించినట్లు క్లబ్ కార్యదర్శి అలహరి హరి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, నర్రా శ్రీలక్ష్మి, జాగర్లమూడి శివకుమారి, అంజాద్ బాషా, వెంకట్రామయ్య దంపతులు తదితరులు పాల్గొన్నారు.

18న మండల స్థాయి శతక పద్య పోటీలు

పంగులూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోటపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 18న మధ్యాహ్నం శతకపద్య పోటీలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం ఎం.వడ్లమూడి వేణుబాబు తెలిపారు. 4, 5, తరగతులకు, 6, 7, తరగతుల విద్యార్థులకు వేమనశతక పద్యాలపై, 8, 9, తరగతుల విద్యార్థులకు సుమతీ శతక పద్యాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలస్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో ప్రతి పాఠశాల నుంచి ఒక్కో విభాగం నుంచి ఒక విద్యార్థి ఈ పోటీలలో పాల్గొనవచ్చన్నారు.



నూతన స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది, అంబడిపూడిలో ఏర్పాటు చేస్తున్న నూతన లైన్లు, గుంటుపల్లిలో త్రీఫేస్ లైన్, పక్కన పడేసిన పాత విద్యుత్ స్తంభాలు, పనులను పరిశీలిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

విద్యుత్ సమస్యలను పరిష్కరించేలా..!

- నూతన స్తంభాలు, తీగల ఏర్పాటు
- 24 గంటలు గ్రామాలలో త్రీఫేస్ విద్యుత్ ఉండేలా ప్రత్యేక లైన్
- పంటలకు, గృహాలకు వేర్వేరుగా లైన్లు

బల్లికురవ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు శిథిలావస్థకు చేరాయి. కొన్ని గ్రామాలలో ఇనప చువ్వలు కూడా బయటపడి గాలులకు స్తంభాలు విరిగి పడేలా ఉన్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు లో-వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉండేది. దీనిపై దృష్టిసారించిన ఆర్‌డీఎస్‌ఎస్ పథకం ద్వారా ప్రత్యేక లైన్ల పనులను శరవేగంగా చేయిస్తోంది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో పలుగ్రామాల్లో జోరుగా పనులు సాగుతున్నాయి.

మండలంలోని గుంటుపల్లి, అంబడిపూడి, వల్లాపల్లి, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, సూరేపల్లి, కొణిదెన, నక్క బొక్కలపాడు, బల్లికురవ, మల్లాయపాలెం తదితర గ్రామాలలో రెండు మాసాల నుంచి ఆర్‌డీఎస్‌ఎస్ పథకంలో భాగంగా ప్రత్యేక విద్యుత్ లైన్ల పనులు చేపడుతున్నారు. గ్రామాలలో సుమారు 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పాత స్తంభాలను తొలగించి బాగా ఎత్తుగా ఉన్న స్తంభాలను ఏర్పాటు చేసి కొత్త వైర్లు కూడా వేస్తున్నారు. దీనికి తోడు గతంలో గ్రామాలలో సింగిల్ ఫేస్ విద్యుత్ మాత్రమే ఉండేది. ఇప్పుడు ప్రత్యేక లైన్ల వలన వ్యవసాయానికి ప్రత్యేక లైన్‌తో పాటు గృహాలకు సైతం త్రీఫేస్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. దీనివలన గ్రామాలలో వినియెగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందనుంది. అలానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన మేరకు విద్యుత్ స్తంభాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. లైన్ల ఏర్పాటులో భాగంగా అడ్డుగా ఉన్న పిచ్చి మొక్కలను సైతం తొలగిస్తుండడంతో ముందు ముందు విద్యుత్ సరఫరాలో లోపాలు కూడా వచ్చే సమస్య ఉండదు అని అధికారులు అంటున్నారు. గతంలో ఉన్న సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లను తీసి వేసి కొత్తగా 100 కేవీ త్రిఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు అన్ని పూర్తి అయితే గ్రామాలలో విద్యుత్ సమస్యలు తొలగి పోతాయని ప్రజలు అంటున్నారు. గ్రామాలలో జరుగుతున్న విద్యుత్ లైన్ల పనులను అద్దంకి డీవిజన్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, మార్టురు ఏడీఈ సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, గ్రామాల విద్యుత్ సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నారు. కొన్ని గ్రామాలలో చేపట్టిన పనులు పూర్తి కాగానే మిగిలిన గ్రామాలలో చేయిస్తామని అధికారులు అంటున్నారు.

ఘనంగా ఇంజనీర్స్‌డే



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధికారులు

చీరాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మానవుడు ప్రపంచాన్ని చుట్టేయగలడనే నమ్మకాన్ని నిలబెట్టింది ఇంజనీర్స్ అని, వారి గొప్పతనం అసాధరణమని ఆర్డీవో చంద్ర శేఖర్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం సమావేశం హాలులో ఇంజనీర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు ఇంజనీర్లను సత్కరించారు. కార్యక్రమంలో డీఈ రాఘురామ్, వైస్ చైర్మన్ సుబ్బయ్య, టీపీవో శ్రీనివాసులు, ఏఈ రవికుమార్, శరత్, విజయ భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న అతిథులు

సెయింట్ ఆన్స్ కళాశాలలో..

చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపల్ జగదీష్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ డే నిర్వహించారు. కార్యక్రమానికి బాపట్ల ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.ప్రసాదరావు, డిప్యూటీ ఇంజనీర్ నళినీ, హైదరాబాదు ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రదర్శన అందించిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు.

సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నిరసన



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అద్దంకి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ అద్దంకి జోన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, మోమో నెం.57ను అమలు చేయాలని, అన్ని రకాల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కంకణాల శ్రీనివాసరావు, మాడుగుల కిషోర్‌బాబు, మలాది నాగరాజు, జి. ఎలీషా, కరి రామయ్య, రమేష్‌బాబు, మల్లికార్జునరావు చెంచు రామారావు, రహమ్‌తుల్లా పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల వినతి

ఇంకొల్లు : ఇంకొల్లు మండలంలోని సచివాలయ ఉద్యోగులు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసును కలిసి తమ సమస్యల పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంటింటికి తిరిగి చేసే సేవలు, సర్వేల నుంచి తమకు విముక్తి కల్పించాలని కోరారు. సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ఉండేలా విధులను కేటాయించాని విన్నవించారు. తహసీల్దారు శ్రీనివాస్ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రోటరీ ఆధ్వర్యంలో విత్తన బంతుల తయారీపై శిక్షణ



విత్తన బంతులను తయారుచేస్తున్న విద్యార్థులు

పంగులూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మట్టితో విత్తనబంతులను తయారు చేసి మొక్కలపెంపకం చేపట్టే విధానంపై రోటరీక్లబ్ ప్రతినిధులు పాఠశాల విద్యార్థులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. మండలంలోని పంగులూరు, కొండమంజులూరు ఉన్నత పాఠశాలల్లో చిలకలూరిపేటకు చెందిన విశ్రాంత లెక్చరర్, రోటరీప్రతినిధి లక్ష్మీనారాయణ విత్తనబంతులను తయారు చేసే విధానం, తద్వారా మొక్కల పెంపకం గురించి విద్యార్థులకు వివరించారు. ఎర్ర మట్టితో కంపోస్ట్ ఎరువులు కలిపి వాటిని బంతులుగా తయారుచేసి ఆబంతిలో ఓ విత్తనం వేసి చెట్లులేని ప్రాంతంలో బంతులు వేస్తే మొక్కలు ఏర్పడి చెట్లుగా ఎదుగుతాయన్నారు. గానుగ, వేప, తురాయి, నేరేడు విత్తనాలతో విద్యార్థులకు విత్తన బంతులు తయారు చేయించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు విద్యార్థులు విత్తన బంతులు తయారు చేసి, రోడ్లవెంట, చెట్లు పెంచేందుకు అనువుగా ఉన్న ఖాళీ ప్రదేశాలలో చెట్లను పెంచాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు సోమేపల్లి శ్రీనివాసరావు, ఐ.అనిత, రావిశ్రీనివాసరావు, మేరీశ్యామల, శ్రీనివాసకుమార్‌లు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పూర్తిచేయండి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

మార్టూరు, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఉన్న కేసులను వీలయినంత త్వరితంగా పూర్తిచేయాలని బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు అన్నారు. సోమవారం ఆయన మార్టూరు స్టేషన్ లో వార్షిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ లో ఉన్న కేసులకు చెందిన రికార్డులను పరిశీలించారు. వాటిలో పురోగతి సాధించిన కేసుల వివరాలను సీఐ యం శేషగిరిరావును అడిగి తెలుసుకున్నారు.అంతేగాకుండా స్టేషన్ పరిదిలో శాంతి భద్రతలు, సెంటర్లో ట్రాఫిక్,స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల ప్రవర్తన తదితర విషయాల గురించి ఆయన సీఐ తో చర్చించారు.స్టేషన్ పరిదిలో లోక్ అదాలత్ లో పరిష్కారయిన కేసుల గురించి ప్రస్తావించారు.ఇంకా పలువిషయాలపై వివ రాలను తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ సైదా,ఏఎస్ఐ భాషా తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించాలి

● రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

మార్టూరు, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):భూ రెవెన్యూ సమస్యలను త్వరితంగా పరిష్కరించకపోవడంతోరైతులు ఇబ్బందులు పడుతున్నారని సోమవారం మండల తహసిల్దారు కార్యాలయం వద్ద ఏపి రైతు సంఘం మండల కమిటి నాయకులు ధర్నా చేశారు.అనంతరం వారు తహసిల్దారు టి ప్రశాంతికి వినతి పత్రం అందచేశారు.ఈ వినతి పత్రంలో మొదటి విడత రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేస్తామని,ఈ ఏడాది జనవరి నెలలో గ్రామ సభలు నిర్వహించిరైతుల దగ్గర దరఖాస్తులు తీసుకున్నారని,కాని ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు.అందువలన రీసర్వేలో జరగిన పొరబాట్లు,జాయింట్ ఎల్‌పి లు,ఈ నాం భూములు,ఎస్టేట్ భూములు, చుక్కలు భూములు తదితర సమస్యలను వెంటనే అధికారులు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు,బత్తుల హనుమంతరావు,గోనుగుంట్ల మోహనరావు,ఇందుర్తి నాగేశ్వరరావు,బోడపాటి సూరిబాబు,సాంబయ్య,రాంబాబు ,వీ రవల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నీటిశుద్ధిలో నిబంధనలు గాలికి

అనధికారిక స్టిక్కర్లతో విచ్చలవిడిగా విక్రయాలు

చీరాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మినరల్ వాటర్ మాయాజాలం ఆకాశాన్నంటుతోంది. అనధికార నీటిశుద్ధి కేంద్రాల నిర్వాహకులు ప్రజారోగ్యాన్ని కాలరాస్తున్నారు. నీటిశుద్ధిలో నిబంధనలు పాటించకుండా కాసుల వేట సాగిస్తున్నారు. విచ్చలవిడిగా డ్రికింగ్ మినరల్ వాటర్ పేరుతో అనధికార స్టిక్కర్స్ ముద్రించి ప్రజలను మోసగిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా పలు రెస్టారెంట్లు, హోటల్స్‌లో, దుకాణాల్లో నకిలీబ్రాండ్లు జోరందుకున్నాయి. కొందరు వాటర్ ప్లాంట్ నిర్వాహకులు కూడా నిబంధనలకు పాతర వేశారు. ప్రస్తుతం ఈ తరహా సంస్థలు కోకొల్లలు మార్కెట్‌లో వెలిశాయి. నిబంధన ప్రమాణాలు లేని నీటిని ప్లాస్టిక్ బాటిల్స్‌లో నింపి విక్రయాలు చేస్తున్నారు.

నిబంధనలు గాలికి..

తాగునీరు తయారీ కేంద్రంలో ఏసీతో పాటు కెమికల్, బయోలజీ ల్యాబ్, ఫిల్లింగ్ గదిని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. బీఐఎస్ నిబంధనలకు అనుగుణంగా ప్లాంట్ స్టెయిన్‌లెస్ స్టీలుతో అమర్చి ఉండాలి. సంబంధిత అధికారులు ప్రతి మూడు నెలలకు ఆ ప్లాంట్ నిర్వహణలో శాంపిల్స్ పరిశీలించాలి. ఈ నేపథ్యంలో నిబంధనలు అమలు జరుగుతున్నప్పుడే నిర్వహణ కొనసాగించాలి. అలాగే ప్లాంట్‌లో క్లోరినేషన్ తప్పనిసరిగా పాటించాలి. ఫిల్టర్స్ శుభ్రత నిత్యం ఉండాలి. అయితే ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా దాదాపుగా ఈ తరహా నిబంధనలు ఆచరించడంలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇష్టారీతిగా నాసిరకం నీరు బాటిళ్లలో నింపి డబ్బులు దండుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఇటీవల కాలంలో ప్లాంట్‌ల నిర్వహణపై అధికారుల తనిఖీలు శూన్యం. నీటిశుద్ధి లోపించిన నీటి విక్రయాలు జరుగుతన్న బహిరంగ రహస్యమే అయినా తనిఖీలు లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

రెగ్యులర్ తహసీల్దార్ కోసం వినతి

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం తహసీల్దార్ కార్యాలయానికి రెగ్యూలర్ తహసీల్దార్‌ను నియమించాలని పలువురు వైసీపీ నేతలు కోరారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రెండు మండలాలకు సంబంధించి ఒకే అధికారి ఉండడంతో విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికేట్స్ సైతం జాప్యం జరుగుతున్నట్లు వారు తెలిపారు.

54వ గంధ మహోత్సవం

చీరాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైకుంఠపురం దర్గా పరిధిలో 54వ గంధ మహోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రాత్రి కంబల్ ఫాతెహా, గురువారం రాత్రి గంధం ఊరేగింపు, అదేరోజు అన్నదానం, శుక్రవారం భక్తులకు గంధం పంపిణీ, శనివారం ప్రసాద వితరణ పంపిణీ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెరగాలి



విద్యార్థితో పాఠం చదివిస్తున్న ఎంఈవో

అద్దంకిటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చదువును విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునేలా పాఠశాలలో బోధించి సామర్థ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో కేవీ.శ్రీనివాసరావు సూచించారు. సోమవారం పట్టణంలోని సత్రంబడిని ఆయన సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతుల వారిగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజనం పథకం రోజువారి మెను అమలు చేయాలన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన పాఠశాల ఉపాధ్యాయురాలు ధనలక్ష్మిని ఎంఈవో, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గర్నెపూడి శ్యామ్‌కుమార్, బాబురావు, కొంగల శ్రీనివాసరావు, పాలపర్తి యోనా, ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శక్తి బృందం

చినగంజాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మహిళలకు శక్తి యాప్ రక్షణ కవచంలాంటిదని ఇంకొల్లు సీఐ వైవీ.రమణయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శక్తియాప్, 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్', సైబర్ నేరాలు, ఆత్మరక్షణ, డ్రగ్స్, నార్కోటిక్స్ ప్రమాదాల గురించి చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. చీరాల శక్తి బృందం ఎస్ఐ ఏ.హరిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో మహిళలు తక్షణం పోలీసు రక్షణ పొందేందుకు శక్తియాప్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరు తమ సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థలకు దూరంగా ఉండాలని అన్నారు. గుడ్, బ్యాడ్ టచ్‌లు, బాల వివాహాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను అరికట్టే హెల్ప్‌లైన్ నంబర్లు 1972, 1098, 181, 112, 100ల గురించి వివరించారు. విద్యార్థులు 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శీలం రమేష్, చీరాల శక్తి బృందం సభ్యులు, పాఠశాల హెచ్.ఎం. కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఇంకొల్లు, సెప్టెంబరు 15,(ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో కిరణ్ తెలిపారు. సమావేశానికి మండల స్థాయిలోని అన్నీ శాఖల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు తమ రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వ స్థలాల్లో చెత్త వేస్తే చర్యలు

● ఎంపీడీవో కుసుమకుమారి హెచ్చరిక



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

బల్లికురవ, సెప్టెం బరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో రోడ్ల వెంబడి, ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా చెత్తవేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో కుసుమ కుమారి హెచ్చరించారు. బల్లికురవ బస్టాండ్ ఆవరణలో వ్యర్థాలను పెద్దఎత్తున వేయడంతో దుర్వాసన వస్తోందని సోమవారం స్థానికులు నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీడీవో పరిశీలించి వ్యర్థాలను గ్రామ పంచాయతీ ద్వారా తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బల్లికురవ గ్రామంలోని దుకాణాల వారు చెత్త ఎక్కడపడితే అక్కడవేస్తే వారికి అపరాధం విధిస్తామన్నారు. గ్రామాలలో ఉన్న చెత్తసంపద కేంద్రాలలో చెత్తను వేయాలన్నారు. ప్రజలు, వ్యాపారులు సహకరించాలన్నారు. పంచాయతీ సర్పంచ్ పందిరి అంజిబాబు, పంచాయతీ కార్యదర్శి ప్రసాదరెడ్డిల పర్యవేక్షణలో వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టారు. బల్లికురవ కూడలిలో వ్యర్థాలు తొలగించడంపై దుకాణదారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.